సహజీవన భావనల పావురాయి
వారపత్రిక 7-7-2023 ₹ 15/-

# ఎన్నికలొస్తున్నాయిగా...
# ఉమ్మడి పౌరస్మృతి మళ్ళీ తెరపైకి









సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 27 హైదరాబాద్
శుక్రవారం 7 జులై 2023 రూ.15-00
18 జిల్‌హజ్జా 1444 హిజ్రీ

**తొలిగీటు**

కోపం షైతాన్ ప్రభావం వస్తుంది.
షైతాన్ అగ్ని నుంచి సృజించబడ్డాడు.
నిప్పు నీటితోనే చల్లారుతుంది.
అందుచేత మీరు కోపం వచ్చినప్పుడు
వెంటనే వుజూ చేయాలి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



12

బాబిలోనియా నుండి బక్కా వరకు

## లోపల...

| | | |
|---|---|---|
| రాజకీయ లౌక్యం | ...... | 04 |
| ఎన్నికలొస్తున్నాయిగా ... ఉమ్మడి పౌరస్మృతి తెరపైకి | ...... | 05 |
| వైద్యులారా వందనం! | ...... | 10 |
| చరితార్థులు-2 : నవాబ్ మిర్జా షంసుద్దీన్ అహ్మద్ ఖాన్ | ...... | 16 |
| ఈ వారం ఫేక్ వార్తల రౌండప్ | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| పరమోన్నత మిత్రుని వద్దకు | ...... | 21 |
| ఆడపిల్లలే 'రేపటి' అండ | ..... | 24 |
| జర జాగ్రత్తా! పాపకర్మలు రికార్డు అవుతున్నాయి... | ...... | 27 |
| సత్సమాజ నిర్మాణం కోసం | ...... | 28 |
| స్వర్గం - స్వర్గవాసులు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| తల్లిదండ్రులు | ...... | 34 |

**అవునా.. నిజమా.. ఏమో!?**




బీజేపీకి బీఆరెస్
బీటీమని పుకారు
నిజమో కాదో గాని
చేస్తున్నది షికారు!
అట్లాగే ఉన్నదంట
చూస్తుంటే వాలకం
పైన కుస్తీ లోన దోస్తీ
యిదేనంట కీలకం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## రాజకీయ లౌక్యం

**గత** ఎనిమిది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా ప్రధాని మోడీ పత్రికా సమావేశంలో రిపోర్టర్ల ప్రశ్నలకు జవాబిచ్చే ఎలాంటి కార్యక్రమం లోనూ పాల్గొనలేదు. అమెరికా పర్యటనలో మొదటిసారి ఆయన పత్రికా సమావేశంలో రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు జవాబులిచ్చారు. చాలా మంది చాలా సార్లు అడిగినా ఒక్కసారి కూడా పత్రికా సమావేశం మోడీ నిర్వహించలేదు. కాని అమెరికా పర్యటనలో, శ్వేతసౌధాన్ని సందర్శించిన విదేశీ ప్రముఖులు పత్రికాసమావేశంలో మాట్లాడక తప్పని పరిస్థితి కాబట్టి ఆయన ఒకే ఒక ప్రశ్నకు జవాబిస్తా రని భారత బృందం చెప్పింది. ఆ ఒక్క ప్రశ్న కూడా భారతదేశంలో ముస్లిముల పరిస్థితి గురించి అడిగిన ప్రశ్న కావడం గమనించదగిన విషయం. ఆ ప్రశ్న భారత ముస్లిములపై దాడులు, మానవహక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన ప్రశ్న.

తన జవాబులో ప్రధాని దాదాపు డజను సార్లు ప్రజాస్వామ్యం అనే పదం ఉపయోగించారు. జవాబిచ్చాననిపించారు. తమ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమపథకాలు కులమతవివక్ష లేకుండా అందరికీ అందుతున్నాయని చెప్పారు. మానవహక్కులను పక్కనపెడితే, వివక్షలు అమలు చేసినట్లయితే భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఎలా ఉంటుందని ఎదురు ప్రశ్నించారు. కాని 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి ప్రపంచ దేశాల్లో భారతదేశ ప్రతిష్ఠ ప్రజాస్వామిక దేశంగా పెరుగుతుందా తగ్గుతుందా అన్నది ప్రధానమైన ప్రశ్న. అసలు ఎప్పుడైనా అమెరికా పర్యటనలో భారత ప్రధానికి భారతదేశంలో మైనారిటీల భద్రత విషయంలో ప్రశ్నలు ఎదుర్కునే పరిస్థితి గతంలో ఎప్పుడైనా తలె త్తిందా? అనేకానేక విషయాల గురించి పాత్రికేయులు గత ప్రధాను లను ప్రశ్నించారు కాని మైనారిటీల భద్రత గురించి ప్రశ్నించిన సందర్భం కనబడదు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూక హత్యలు పెరిగాయి. గోరక్షక దళాల దాడులు పెరిగాయి. మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. కాని మోడీ అనేక సందర్భాల్లో కేవలం మౌనమే తన మాటగా ఊరుకుంటున్నారు.

గత తొమ్మిది సంవత్సరాల కాలంలో భారతదేశం ప్రెస్ ఫ్రీడం విషయంలో రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్ ఇటీవలి వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్సులో 180 దేశాల జాబితాలో భారతదేశాన్ని 161 స్థానంలో పెట్టింది. 2022లో కనీసం 150వ స్థానంలో ఉండేది. 2023 నాటికి 11 స్థానాలు దిగజారింది. అనేకమంది రిపోర్టర్లపై తీవ్రమైన కేసులు నమోదయ్యాయి. జైళ్ళలో మగ్గుతున్నారు. చివరకు కరోనా కాలంలో కూడా కరోనా లాక్ డౌన్ కష్టాలను రిపోర్టు చేసిన దాదాపు 55 మంది జర్నలిస్టులపై చర్యలు తీసుకున్న వార్తలు వచ్చాయి.

2014 తర్వాతి నుంచి మూకహత్యల సంఘటనలు దేశంలో మైనారిటీలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. అనేక మూకహత్యల సంఘటనలు ప్రపంచ మీడియాలో కూడా వచ్చాయి. ఇటీవల ఉత్తరాఖండ్ పురులా పట్టణంలో లవ్ జిహాదు సాకుతో ముస్లిములను బాయ్ కాట్ చేయాలని పిలుపునిచ్చారు. హరిద్వార్‌లో జరిగిన ధర్మసంసద్‌లో ముస్లిముల ఊచకోతలకు పిలుపు నిచ్చారు. పాలకపార్టీ అభయహస్తం ఉందన్న ధీమా వల్లనే గుంపులు పేట్రేగి పోతున్నాయని పలువురు విశ్లేషించారు. విద్వేష వ్యాఖ్యలు, ప్రసం గాలు చేయడం మతతత్వ శక్తులకు మామూలయ్యింది. మెజారిటీ హిందూత్వ రాజకీయాలను బీజేపీ బాహాటంగానే నడుపుతోంది. బాబరీమస్జిద్ వివాదంలో కోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఈ తీర్పుపై పార్టీ సంబరాలు జరిపింది. కోర్టు తీర్పు బాబరీ మస్జిద్ కూల్చివేతను అక్రమమని పేర్కొన్నప్పటికీ ఆ భూమిని హిందూ గ్రూపులకు కేటా యించింది. ఈ తీర్పు వచ్చిన తర్వాత బీజేపీ నేతలంతా ఆనందోత్సా హాల వ్యాఖ్యలు చేశారు. బాహాటంగా తమ రాజకీయాలు హిందూత్వ రాజకీయాలని చాటి చెప్పుకున్నారు.

మోడీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. పొరుగుదేశాల్లో వేధింపులకు గురవుతున్న వారికి భారత పౌరసత్వం ఇచ్చే చట్టం ఇది. కాని విచిత్రంగా ముస్లిములను ఈ చట్టంలో మినహాయించారు. అంటే మతం ఆధారంగా పౌరసత్వం ఇచ్చే చట్టం. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని చాలా మంది భావిం చారు. ఇవన్నీ ఒకవైపు ఉంటే మరోవైపు హిందూరాష్ట్ర డిమాండ్లు, నినాదాలు వినిపిస్తూ వస్తున్నాయి. మోడీ కాలంలో మతఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్వేష నేరాల్లో దోషులకు శిక్షలు పడే అవకాశాలు కనిపించడం లేదు. పైగా తీవ్రమైన సామూహిక బలాత్కారం, హత్య వంటి నేరాల్లో దోషులుగా శిక్ష అనుభవిస్తున్న వారిని విడుదల చేయడం జరిగింది.

ఇంకోవైపు భారత చరిత్రను తిరగరాసే ప్రయత్నాలు జరుగు తున్నాయి. మధ్యయుగాల్లో ముస్లిం పాలకుల కాలాన్ని చరిత్ర పుస్తకాల నుంచి తొలగిస్తున్నారు. బీజేపీ ముస్లిములకు ఎవ్వరికీ టిక్కెట్లు ఇవ్వదు. ఎలాంటి లౌకిక ప్రజాస్వామిక ప్రమాణాలకు ఇవన్నీ నిదర్శనం. ప్రధాని ప్రజాస్వామిక ప్రమాణాల గురించి చెప్పారు కాని మరోవైపు బీహారు ఆర్థిక మంత్రి విజయ్ కుమార్ చౌదరీ బంధువుల ఇండ్లపై నిఘా సంస్థల దాడులు జరుగుతున్నాయి. బీహారులో ప్రతిపక్షల ఐక్యత ప్రయత్నాలు జరుగుతున్నప్పుడే ఈ దాడులు మొదలయ్యాయన్నది గమనించాలి. గత కొన్ని సంవత్స రాలుగా కేంద్ర నిఘా సంస్థలు ప్రతిపక్ష నేతలపైనే దాడులు జరుపుతూ వస్తున్నాయని చాలా మంది చేస్తున్న ఆరోపణలు కూడా గమనించదగినవి. ✤

అబ్దుల్ వాహెద్




# ఎన్నికలొస్తున్నాయిగా ... ఉమ్మడిపౌరస్మృతి తెరపైకి

యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో ధార్మిక సంస్థల అభిప్రాయాలను 22వ లా కమీషన్ ఆఫ్ ఇండియా కోరింది. కర్నాటక హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రితూ రాజ్ అవస్తీ, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే.టీ. శంకరన్, ప్రొ. నంద్ పాలివాల్, ప్రొఫెసర్ డి.పి.వర్మ, ప్రొఫెసర్ రాకా ఆర్య, ఎం. కరుణానిధి లాకమీషన్ సభ్యులుగా ఉన్నారు.

ఈ విషయమై ఆసక్తి ఉన్నవారు 30 రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని లా కమీషన్ కోరింది. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు, సున్నీ ధర్మవేత్త మౌలానా ఖాలిద్ రషీద్ ఫరంగీ మహాలీ ఈ విషయమై మాట్లాడుతూ భారతదేశంలో యూనిఫాం సివిల్ కోడ్ వల్ల వివిధ ధార్మిక నేపథ్యాలున్న వ్యక్తులపై ప్రతికూల ప్రభావాలు పడతాయని అన్నారు. మన రాజ్యాంగంలో వివిధ రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తులున్నాయని, మిజోరం, నాగాలాండ్, త్రిపుర వంటి రాష్ట్రాలు ఉదాహరణలని అన్నారు. దేశంలోని ఆదివాసీలు, గిరిజనులు తమ ఆచార సంప్రదాయాలు పాటించడానికి పూర్తి భద్రత రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. వాటన్నింటిని ఎలా కాదనగలమని చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ విషయమై జమీఅతె ఉలమాయే హింద్ ఒక తీర్మానం ఆమోదించింది. ఉత్తరప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లో జరిగిన ఒక సమావేశంలో జమీఅత్ ఈ తీర్మానం ఆమోదించింది. యూనిఫాం సివిల్‌కోడ్ వల్ల దేశంలోని సముదాయాలకు వ్యక్తిగత చట్టాలను పాటించే హక్కు లభించదని, ఇది రాజ్యాంగం ఇచ్చిన హామీలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.

యూనిఫాం సివిల్ కోడ్ చర్చ అప్పుడప్పుడు దేశంలో వస్తూ

పోతూనే ఉంది. కాస్త పరిశీలిస్తే ప్రతిసారి ఎన్నికలకు ముందు ఈ చర్చ మొదలవుతుందని గమనించవచ్చు. ఇప్పుడు లా కమీషన్ ఈ చర్చ ప్రారంభించింది. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ విషయమై చెప్పిన మాటలు కూడా గమనార్హమైనవి. యూనిఫాం సివిల్ కోడ్ అనేది ఆదేశిక సూత్రాల్లో ఉందని, ప్రభుత్వం దీనికి కట్టుబడి ఉందని చెప్పింది. అయితే వెంటనే దీనిపై చర్చలు అవసరం లేదని కూడా చెప్పింది. ఇంతకు ముందు 2018లో లా కమీషన్ ఇలాంటి కసరత్తే చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో యూనిఫాం సివిల్ కోడ్ అవసరం లేదని, మంచిది కూడా కాదని అభిప్రాయపడింది. అప్పటికి ఇప్పటికి ఏం మారిందని మరోసారి యూనిఫాం సివిల్ కోడ్‌ను తెరపైకి తీసుకువచ్చారు?

యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయడం ప్రభుత్వం విధిగా చేయవలసిన పని అని రాజ్యాంగంలో ఉందా? అధికరణ 44లో ఆదేశిక సూత్రాల్లో ఈ విషయం ఉంది. ఇది విధిగా చేయవలసిన పని కాదు. హఠాత్తుగా ఇప్పుడు యూనిఫాం సివిల్ కోడ్‌ను తెరపైకి ఎందుకు తీసుకువచ్చారు. లోక్ సభ ఎన్నికలు 2024లో జరగబోతున్నాయి. ఎన్నికలకు ముందు యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందన్న అభిప్రాయం కలిగిస్తే ఎన్నికల్లో లాభం కలుగుతుందనే ఎన్నికల ఎత్తుగడలో ఇది భాగమని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. దేశంలో వివిధ ధర్మాలు వారి వ్యక్తిగత చట్టాలున్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, సంరక్షణ వంటి అనేక విషయాల్లో వ్యక్తిగత చట్టాల ప్రకారం నడుచుకోవాలని వివిధ సమూహాలు భావిస్తాయి. ఇలాంటి సమస్యలన్నింటిని లా కమీషన్ పరిష్కరించేస్తుందని ఎలా భావించగలం? ఎన్నికలకు కేవలం కొన్ని నెలల ముందు యూనిఫాం సివిల్ కోడ్ సమస్యను తెరపైకి తీసుకురావడంలో ఎన్నికల రాజకీయాలున్నాయని చాలా మంది విశ్లేషిస్తున్నారు.

యూనిఫాం సివిల్ కోడ్‌ను కేవలం ముస్లిములే వ్యతిరేకిస్తున్నారని భావించడం తప్పు. దాదాపు 30 ఆదివాసీ గిరిజన సంఘాల ప్రతినిధులు జూన్ 24వ తేదీన సమావేశమై యూనిఫాం సివిల్ కోడ్ గురించి చర్చించారు. గిరిజన సంప్రదాయ చట్టాలను యూనిఫాం సివిల్ కోడ్ దెబ్బతీస్తుందని వారు భావిస్తున్నారు. ఆదివాసీ సమ్మాన్వాయ్ సమితి యూనిఫాం సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా నిరసనకు దిగాలని నిర్ణయించింది. ప్రతిపక్షాలు కూడా యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో వ్యతిరేకత వ్యక్తం చేశాయి. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ఈ విషయమై మాట్లాడుతూ తమ పార్టీ యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకించదు కానీ ఉమ్మడి పౌరస్మృతి వల్ల హిందువులకు కూడా సమస్యలు తలెత్తుతాయని అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ కేవలం ముస్లిములకు మాత్రమే సమస్య అని భావిస్తున్న వారు దీనివల్ల హిందువులకు కూడా సమస్యలున్నాయని గుర్తించాలన్నారు. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు గోవధ నిషేధం అమలు చేయాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో గోవధ నిషేధం లేదని, గోవా ముఖ్యమంత్రిగా పని చేసిన మనోహర్ పరిక్కర్ తమ రాష్ట్రంలో ఆవులకు కొరత వస్తే దిగుమతి చేసుకుంటామని చెప్పిన మాటలు కూడా ఉద్ధవ్ థాక్రే గుర్తు చేశారు. మొత్తం దేశంలో ఒకేమాదిరిగా గోవధ నిషేధాన్ని అమలు చేయలేకపోయిన వాళ్ళు మొత్తం దేశంలో ఒకేమాదిరి యూనిఫాం సివిల్ కోడ్ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ విషయమై మాట్లాడుతూ ఇప్పుడు హఠాత్తుగా యూనిఫాం సివిల్ కోడ్‌పై లా కమీషన్ ఎందుకు చర్చ




ప్రారంభించిందన్న కారణాలు స్పష్టంగా చెప్పలేదని విమర్శించారు. బీజేపీ విభజన రాజకీయాలే దీని వెనుక ఉన్నాయని అన్నారు. బీజేపీ మిత్రపక్షంగా ఉండి దూరమైన జనతాదళ్ యునైటెడ్ కూడా యూనిఫాం సివిల్ కోడ్ గురించి ఈ చర్చను విమర్శించింది. దేశంలో విభజన రాజకీయాలు, మతతత్వ రాజకీయాల్లో ఇది ఒక భాగమని తృణమూల్ కాంగ్రెసు విమర్శించింది. ఉద్యోగాలు ఇవ్వలేనప్పుడు, అధికధరలను తగ్గించలేనప్పుడు, ఇచ్చిన ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేకపోయినప్పుడు 2024 ఎన్నికల ప్రయోజనాల కోసం ఈ విభజన రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. దేశ పౌరులకు యూనిఫాం సివిల్ కోడ్ తీసుకొచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశిక సూత్రాల రూపంలో రాజ్యాంగం సూచిస్తోంది. కానీ చాలా కాలంగా దేశంలో ముస్లిములే కాదు చాలా మంది హిందువులు కూడా యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు.

ఆదేశిక సూత్రాలను పరిశీలిస్తే, అధికరణ 45 ప్రకారం ఆరేళ్ళ లోపు పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. ప్రాధాన్యత దృష్ట్యా ఇది చాలా ముఖ్యమైన అధికరణగా భావించాలి. ఎందుకంటే, ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రిసర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రచురించిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచంలో 121 దేశాల్లో మనదేశం 107వ స్థానంలో ఉందని వార్త. కాబట్టి ఆదేశిక సూత్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడమన్నది అత్యంత ప్రాముఖ్యం ఉన్న అంశంగా తీసుకుని దానిపై చర్చ జరగాలి. కాని దానిపై చర్చ జరగడం లేదు. ఉమ్మడి పౌరస్మృతి గురించి వాదించే వారు ఒకే దేశం ఒకే చట్టం అనే నినాదం వినిపిస్తుంటారు. కాని ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, పుదుచ్చేరి, మధ్యప్రదేశ్, కర్నాటక, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ, బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గోవధ నిషేధ చట్టాలున్నాయి. కానీ డామన్ డయ్యు, గోవాల్లో ఉన్నాయా? దేశవ్యాప్తంగా గోవధ నిషేధ చట్టం ఒకేలా ఎందుకు అమలు కావడం లేదు? అధికరణ 244 ప్రకారం ఈశాన్య రాష్ట్రాల గిరిజన తెగల ప్రజలకు ప్రత్యేక ప్రొవిజన్లున్నాయి. అక్కడ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిళ్ళున్నాయి. అయితే అరుణాచల ప్రదేశ్, నాగాల్యాండ్, మిజోరంలో కొన్ని భాగాల్లో ఇవి చెల్లవు. అలాగే షెడ్యూల్డ్ ఏరియాలలో గిరిజన తెగలకు ప్రత్యేక ప్రొవిజన్‌లు ఉన్నాయి.

నాగాల్యాండ్ నుంచి 2016లో ఒక వార్త వచ్చింది. ఈస్టర్న్ మిర్రర్ పత్రికలో ఆ వార్త వచ్చింది. నాగా బార్ అసోసియేషన్ యూనిఫాం సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా జారీ చేసిన ప్రకటన అది. యూనిఫాం సివిల్‌కోడ్ కోసం నరేంద్రమోడీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని దెబ్బతీస్తాయని, నాగా ప్రజల సంస్కృతికి అది విఘాతమని ఆ ప్రకటన సారాంశం. నాగాలాండ్, మేఘాలయ, మిజోరం ప్రజల స్థానిక కట్టుబాట్లకు రాజ్యాంగ పరమైన రక్షణ ఉంది. ఉదాహరణకు ఆస్తులు, వారసత్వం విషయంలోను అక్కడి సంప్రదాయాలు వేరు. భారత్‌లో పౌర స్మృతులు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. అందువల్ల 1970ల నుంచి రాష్ట్రాలు తమకంటూ సొంత పౌర స్మృతులను రూపొందించుకుంటూ వస్తున్నాయి. హిందువుల్లో కొడుకులతో సమానంగా కూతుళ్లు కూడా వారసత్వ ఆస్తిలో వాటాను పొందేలా 2005లో చట్టాలను సవరించారు. కానీ దీనికంటే ముందే సుమారు అయిదు రాష్ట్రాలు అమ్మాయిలకు వారసత్వ ఆస్తిలో వాటా హక్కును కల్పిస్తూ చట్టాలు చేశాయి. వీటిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి.

బహుభార్యత్వానికి సంబంధించి ముస్లిముల పర్సనల్ లా వారికి అనుమతిస్తుంది కాబట్టి ముస్లిములు ఒకటి కన్నా ఎక్కువ పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారన్న అపోహ ఎప్పటి నుంచో ఉంది. గతంలో నితిన్ గడ్కరి చేసిన వ్యాఖ్య గమనించాలి. నలుగురిని వివాహమాడడం అనాగరికమని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చాలా మంది యూనిఫాం సివిల్ కోడ్ చర్చ వచ్చినప్పుడు చేస్తుంటారు. దీనికి సంబంధించిన వివరాలు చూద్దాం. 1961లో మతపరంగా బహుభార్యత్వంపై జనాభా లెక్కల్లో వివరాలున్నాయి. ఆ వివరాల ప్రకారం ముస్లిముల్లో బహుభార్వత్వం తక్కువ. ముస్లిముల్లో 5.7శాతం ఉంటే, హిందువుల్లో 5.8శాతం ఉంది. బహుభార్యత్వం హిందువుల్లో చట్టపరంగా నిషిద్ధం. 1950లోనే ఈ చట్టం వచ్చింది. గిరిజనుల్లో చాలా ఎక్కువ 15.25 శాతం ఉంది. 2016లో కాంగ్రెస్ నేత జైపాల్ రెడ్డి మాట్లాడుతూ బహుభార్వత్వం ముస్లిముల కన్నా హిందువుల్లోనే ఎక్కువగా ఉందని అన్నారు. 1974లో ఒక సర్వే జరిగింది. ఆ సర్వే ప్రకారం ముస్లిముల్లో బహుభార్వత్వం 5.6శాతం. హిందువుల్లో 5.8శాతం. 2006లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే జరిగింది. దేశంలో 2 శాతం భార్యలు తమ భర్తలకు మరో భార్య ఉందని చెప్పారు. బహువివాహాలనేది ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ. 1950లో హిందూ మ్యారేజ్ యాక్ట్ ద్వారా సాధించిందేమిటి? బహుభార్యత్వాన్ని నిషేధించడం వల్ల బహుభార్యత్వం అంతం కాలేదు. కాని రెండవభార్యగా వచ్చిన మహిళకు సామాజిక, ఆర్థిక భద్రత లేని పరిస్థితి ఏర్పడింది. పైగా మైత్రి కరార్ వంటివి వచ్చాయి. హిందూ పురుషుడు రెండవ వివాహం చేసుకునే అవకాశం లేనందువల్ల చట్టం నుంచి తప్పించుకోడానికి మైత్రికరార్ పేరుతో మరో మహిళతో స్నేహ ఒప్పందం చేసుకునేవాడు. ఇది మరోవిధమైన బహుభార్యత్వం. ఆ తర్వాత దాని పేరు ''సర్వీస్ అగ్రిమెంట్''గా

మారింది. దానికి ఎలాంటి చట్టబద్ధమైన హోదా లేదు.

గతంలో ఉత్తరాఖండ్ ఎన్నికల్లో యూనిఫాం సివిల్‌కోడ్‌ను బీజేపీ ఎన్నికల సమస్యగా ప్రస్తావించింది. ఎన్నికల్లో ప్రయోజనాల కోసం యూనిఫాం సివిల్ కోడ్ ప్రస్తావన అప్పుడప్పుడు తీసుకురావడం జరుగుతూనే ఉంది. కామన్ సివిల్ కోడ్ విషయంలో కేవలం ముస్లిములు మాత్రమే అభ్యంతరాలు చెబుతున్నారా? మిగిలిన వారెవ్వరూ దీనికి అభ్యంతరాలు చెప్పడం లేదా? గోవాలో పోర్చుగ్రీసు వారి కామన్ కోడ్ అమలులో ఉంది. దీని ప్రకారం వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేయడం తప్పనిసరి. పెళ్ళి కాగానే భార్యకు భర్త సగం ఆస్తిలో హక్కు లభిస్తుంది. దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేస్తే ఒప్పుకుంటారా? అవిభక్త హిందూ కుటుంబం ప్రకారం పన్నుల మినహాయింపు పొందుతున్న వారిలో చాలా వ్యాపార కుటుంబాలున్నాయి. వీరంతా కామన్ సివిల్ కోడ్ కోసం ఒప్పుకుంటారా? ఈశాన్య రాష్ట్రాల్లో గిరిజన తెగలు తమ తెగల చట్టాలనే పాటిస్తున్నాయి. వారంతా కామన్ సివిల్ కోడ్‌కు సిద్ధంగా ఉన్నారా? కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాల్లో వివిధ కట్టుబాట్లు సంప్రదాయాలున్నాయి. వాటన్నింటి విషయమేమిటి?

నిజం చెప్పాలంటే యూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించిన డ్రాఫ్ట్ డాక్యుమెంటు ఏదీ లేదు. లా కమీషన్ యూనిఫాం సివిల్ కోడ్ విషయమై గతంలో 16 ప్రశ్నలతో ఒక ప్రశ్నావళి జారీ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణకు ఉద్దేశించిన ప్రశ్నావళి ఇది. దీని గురించి తర్వాత మాట్లాడదాం. ముందు యూనిఫాం సివిల్‌కోడ్ విషయం చూద్దాం. రాజ్యాంగ నిర్మాతలు uniform అన్న పదాన్ని వాడారే కాని common అన్న పదం వాడలేదు. కామన్ అన్న పదం వాడి ఉంటే దేశవ్యాప్తంగా ఒకే చట్టం రావాలి. కాని యూనిఫాం అనే పదంలో ఒకే చట్టం అన్న భావన లేదు, ఒకేమాదిరి చట్టాలన్న భావం ఉంది. బహుళ మతాలు ఉండడం వల్ల మనదేశంలో వివిధ చట్టాలున్నాయనుకోవడం సరికాదు. చట్టాలు రాష్టానికి, రాష్ట్రానికి మారుతాయి. స్త్రీ పురుషులకు కూడా చట్టాన్ని వర్తించడంలో తేడాలున్నాయి. కాబట్టి రాజ్యాంగ నిర్మాతలు దేశవ్యాప్తంగా ఒకే చట్టం ఉండాలని భావించారనో లేక ఒకేదేశం, ఒకే చట్టం అనే భావంతో ఈ అధికరణ పెట్టారనో అనుకోలేము. ఒకేమాదిరి చట్టాలన్న భావనే అందులో ఉంది. ఇలా అభిప్రాయ పడడానికి మరో కారణమేమంటే, పర్సనల్ లాకు సంబంధించి అవసరమైన శాసనాలు చేసే అధికారం పార్లమెంటుతో పాటు అసెంబ్లీలకు కూడా ఉంది.

దేశంలోని హిందువులందరికీ ఒకే చట్టం వర్తిస్తుందా? ఉత్త రాదిలో కొన్ని బంధుత్వాలు వివాహసంబంధాలకు నిషిద్ధం. కాని దక్షిణాదిన అలాంటి నిషేధాలు లేవు. నాగాలాండ్, మేఘాలయ, మిజోరం ప్రజల స్థానిక కట్టుబాట్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంది. ఉదాహరణకు ఆస్తులు, వారసత్వం విషయంలోను అక్కడి సంప్రదాయాలు వేరు.

ఇలాంటి నేపథ్యంలో దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్ తీసుకువస్తామన్న వాదనను పరిశీలించవలసి ఉంది. రాజ్యాంగ నిర్మాతలు యూనిఫాం అన్న పదం వాడడంలోనే వేర్వేరు చట్టాలు ఒకేమాదిరిగా జెండర్ జస్టిస్ సాధించే చట్టాలన్న భావం నిక్షిప్తమై ఉంది. అంతేకాని ఒకే చట్టం దేశవ్యాప్తంగా అనే భావం లేదు.

ఇంతవరకు ఉమ్మడి పౌర స్మృతి మీద కోర్టులు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. గత 40 ఏళ్లలో భిన్న తీర్పుల్లో భాగంగా 'దేశ సమైక్యత'కోసం ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలంటూ సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచిస్తూ వచ్చింది. అలాగే యూనిఫాం సివిల్ కోడ్ ఇప్పుడే అవసరం లేదంటూ 2018 లా కమిషన్ తన నివేదికలో పేర్కొంది. తీవ్రమైన పరిణామాలకు దారి తీసే యూనిఫాం సివిల్ కోడ్‌ను తీసుకురావడం కంటే లింగ అసమానతలను తొలగించడానికి పౌర స్మృతులకు సవరణలు చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. తమ రాజకీయ ఎజెండాను కొనసాగించడంలో భాగంగానే ఉమ్మడి పౌర స్మృతి గురించి బీజేపీ మాట్లాడుతోందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో చాలా కాలంగా బీజేపీ అధికారంలో ఉంది. కానీ ఇంత వరకు అక్కడ యూనిఫాం సివిల్ కోడ్‌ను తీసుకురాలేదు. సాధారణ ఎన్నికలు రానున్న తరుణంలో యూనిఫాం సివిల్ కోడ్ గురించి చర్చలు తెరపైకి వస్తున్నాయి.

కామన్ సివిల్ కోడ్ కన్నా మనకు జెండర్ జస్టిస్ ముఖ్యం. ఉన్నత స్థానాల్లో కూర్చున్న వారు చట్టాలు చేసి క్రింది వారిపై రుద్దడం వల్ల జెండర్ జస్టిస్ సాధ్యం కాదు. సముదాయంలోనే సంస్కరణల ప్రక్రియ జరిగేలా చైతన్యాన్ని, అవగాహనను పెంచడం ద్వారా మాత్రమే మహిళా న్యాయాన్ని సాధించగలం. ఈ ప్రక్రియ క్రమేణా చట్టంగా రూపుదిద్దుకుంటుంది. స్వయంగా ముస్లిమ్ సమాజంలో ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. నికాహ్ నామా నమూనాలు విడుదల చేయడం, త్రిపుల్ తలాక్‌పై ముస్లిమ్ విమెన్ పర్సనల్ లా బోర్డు ప్రయత్నాలు, భారతీయ ముస్లిమ్ మహిళా ఆందోళన్ లేవనెత్తిన సమస్యలు సముదాయంలో జరుగుతున్న ఈ ప్రయత్నాలకు నిదర్శనాలు. మహిళా న్యాయం సాధించేదిశగా ఈ ప్రయత్నాలు నెమ్మదిగా చట్టాలుగా రూపుదిద్దుకోవడం కూడా కాలక్రమంగా జరుగుతుంది. కాని రాజకీయ కారణాలతో కామన్ సివిల్ కోడ్ అని హంగామా చేస్తున్న వారు నిజానికి మహిళా న్యాయం పట్ల చిత్తశుద్ధితో

వ్యవహరించడం లేదు. మతతత్వ రాజకీయాలు నడుపుతున్నారు.

గతంలో ది వైర్‌లో అనూషా రిజ్వి ఒక వ్యాసం రాశారు. ఇక్కడ ఆ వ్యాసంలోని కొన్ని విషయాలు ప్రస్తావించదగినవి. ఆమె ఏం రాశారంటే: దేశంలో మహిళల హక్కుల పరిరక్షణకు చాలా చట్టాలున్నాయి. ది డొమెస్టిక్ వయలెన్స్ యాక్ట్ 2005, ది ప్రివెన్షన్ ఆఫ్ డౌరీ యాక్ట్ 1961, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 125 కింద మెయింటెనెన్స్ వగైరా. ముస్లిములకు పర్సనల్ లా ఉన్నంత మాత్రాన ముస్లిము మహిళలు ఈ చట్టాల ద్వారా ప్రయోజనం పొందలేని అడ్డంకి ఏమీ లేదు. ముస్లిమ్ మహిళలు కూడా ఈ చట్టాలను ఆశ్రయించవచ్చు. అంటే ముస్లిము మహిళల భద్రతకు రెండు విధాల అవకాశాలున్నాయి. వారు ముస్లిమ్ పర్సనల్ లా కింద తమ హక్కుల కోసం పోరాడ్డంతో పాటు, మహిళల హక్కుల పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాలను కూడా ఉపయోగించుకోవచ్చు.

నిజానికి షరియా చట్టాలను అర్థం చేసుకోవడంలో కూడా చాలా మందికి పక్షపాతం పెద్ద అడ్డంకి అవుతుంది. ఆడవాళ్ళకు మగవాళ్ళలో సగమే ఆస్తిహక్కు ఇస్తారన్న వాదన కూడా అలాంటిదే. అసలు మొన్నటి వరకు ఆస్తి హక్కు ఇవ్వని వారు ఈ వాదన చేస్తున్నారు. ఇప్పుడు సమానంగా ఆస్తి హక్కు ఇస్తున్నారా? మహిళలకు ఆస్తి హక్కు కేవలం చట్టరూపంలో కాగితాలపైనే ఉంది. ఎన్ని కుటుంబాలు సమానంగా ఆడపిల్లలకు ఆస్తిలో వాటా ఇస్తున్నాయి. ముస్లిముల్లో మాత్రం కుటుంబ ఆస్తుల పంపకంలో తప్పనిసరిగా వాటా ఇవ్వడం జరగుతుంది. ఆడపిల్లలు నిలదీసి అడిగి మరీ తీసుకుంటారు. షరియా వారసత్వ చట్టాల ప్రకారం కొన్ని సందర్భాల్లో ఆడపిల్లలకు వచ్చిన వాటా మగపిల్లలకు వచ్చిన వాటా కన్నా ఎక్కువ కూడా అవుతుంది. షరియా చట్టం ప్రకారం మహిళకు తాత, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, కుమారుల ఆస్తుల్లో వాటా ఉంది. మరో విషయమేమంటే, పిత్రార్జితం వంటి నిబంధనలేవీ ముస్లిములకు చెల్లవు. మనిషి తాను స్వయంగా సంపాదించిన ఆస్తయినా తన ఇష్టం వచ్చిన వారికి వీలునామా రాసుకునే అధికారం లేదు. అలా రాయాలనుకుంటే కేవలం 30 శాతం సంపదకు అది కూడా తన స్వార్జితమైతేనే రాయగలడు. మిగిలిన సంపదంతా ఎవరికి ఎంత వాటా నిర్ధారితమో అంత ఇవ్వవలసిందే. వీలునామా పేరుతో ఆడపిల్లలను కాదని మగపిల్లలకు ఆస్తులు రాసిచ్చే అవకాశం లేదు. కాబట్టి వారసత్వం విషయంలో అయినా షరియా చట్టం మెరుగైనదే. యూనిఫాం సివిల్ కోడ్ వస్తే అందులో వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటారా?

ముస్లిముల్లో అయినా సరే, పర్సనల్ లా ఇష్టం లేని వారు స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద వివాహాలు చేసుకునే అవకాశం ఎలాగూ ఉంది. కామన్ సివిల్ కోడ్ ముఖ్యమా? మహిళలకు న్యాయం ముఖ్యమా అన్నది అసలు ప్రశ్న. దేశంలోని గిరిజన తెగలు, ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రత్యేక నియమ నిబంధనలు, స్వయంగా అవిభక్త హిందూ కుటుంబం వంటి చట్టాలు ఇంకా ఇలాంటి ఎన్నో ప్రశ్నలు యూనిఫాం సివిల్ కోడ్ తో ముడిపడి ఉన్నాయి. కాని ఎన్నికల రాజకీయాలకు కామన్ సివిల్ కోడ్ ఉపయోగపడుతూనే వస్తోంది. ✤


యువతరానికి
విప్లవవాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**- యండి. ఉస్మాన్ ఖాన్**

**'డాక్టర్' ... అందరికీ సుపరిచితమైన, అందరి నాలుకలపై నర్తించే పేరు. ప్రాణం పోసేవాడు దేవుడైతే, ప్రాణం నిలిపేవాడు డాక్టర్ అంటారు. సమాజంలో వైద్యుడికి అపారమైన ఆదరణ, గౌరవం ఉంది. డాక్టరంటే ఒక నమ్మకం... ఒక భరోసా... ఒక గురి... తమ ప్రాణాలను డాక్టర్ చేతిలో పెట్టి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంటారు ప్రజలు. విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ, వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఎన్నో త్యాగాలు చేస్తాడు వైద్యుడు. లోపల ఎన్ని బాధలున్నా బయటపడకుండా నగుమోముతోనే సగం జబ్బు తగ్గించేస్తాడు. మానవీయ స్పందనలు లేనివారు వైద్య వృత్తికి పనికిరారు. జబ్బుతో వచ్చిన పేషెంట్‌ను ప్రేమించలేని డాక్టర్ కూడా రోగితో సమానమే. అంకిత భావం, బాధ్యతాభావం, చిత్తశుద్ధి అనేవి డాక్టర్‌కు తప్పని సరిగా ఉండవలసిన లక్షణాలు.**

ఒకప్పుడు ఫ్యామిలీ డాక్టర్స్ ఉండేవారు. ఎంతో ఆత్మీయంగా కుటుంబ సభ్యులతో కలిసిపొయ్యేవారు. కుటుంబంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా నిస్సంకోచంగా, ఎలాంటి అరమరికల్లేకుండా వారితో చెప్పుకునేవారు. డాక్టరంటే, ఏదో ప్రత్యేక వ్యక్తిగా కాకుండా ఒక స్నేహితుడిగా ఉండేవాడు. అప్పటి వారు తమకున్న పరిమితమైన పరిజ్ఞానంతో, ప్రత్యేక నైపుణ్యంతో పేషెంట్ నాడిని పసిగట్టి వైద్యం చేసేవారు. ఆరోజుల్లో ఇన్ని రకాల మందులు కూడా లేవు. వ్యాధి కారణాలను కనిపెట్టే సాధనాలు కూడా అందుబాటులో ఉండేవికావు. నాటి ప్రజలు వైద్యుణ్ని నమ్మకమైన స్నేహితుడిగా, ఆత్మీయుడిగా, మార్గదర్శిగా విశ్వసించేవారు. తను కూడా వారి నమ్మకానికి అనుగుణంగా కుటుంబ శ్రేయోభిలాషిగా మసలుకునేవాడు. కాని ఈనాడు ఫ్యామిలీ డాక్టర్ అనే ఆలోచన పూర్తిగా మాయమైంది. డాక్టరు తన వృత్తిని బిజినెస్‌గా, పేషెంటును కస్టమర్‌గా భావించే పరిస్థితి ఏర్పడింది. ఎంతో నమ్మకంతో

తన దగ్గరికి వచ్చే పేషెంట్ల నమ్మకాన్ని వమ్ము చేస్తూ, నమ్మక ద్రోహానికి పాల్పడే డాక్టర్లు అనేకమంది పోగయ్యారు.

వైద్యం కార్పోరేటీకరణ దిశగా పరుగులు పెడుతున్న నేటి దశలో ఫ్యామిలీ డాక్టర్ భావన అడుగంటి, సంపాదనకు అది పర్యాయ పదంగా మారిపోయింది. రోగి అంటే డబ్బు సృష్టించే మిషన్ అన్న భావన ఏర్పడింది. ప్రజారంగంలో ఆరోగ్య సేవలు, సదుపాయాలు క్రమంగా దిగజారిపోయాయి. ప్రజారోగ్యానికి వెన్నెముకలుగా, వెన్నుదన్నుగా నిలబడాల్సిన, పేద ప్రజల అవసరాలు తీర్చాల్సిన ప్రైమరీ హెల్త్ సెంటర్లు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) సరిగా పని చేయడం లేదు. అందులో కావలసిన పరికరాలు సరిగా వుండడం లేదు. డాక్టర్లు, సిబ్బంది కూడా అంతంత మాత్రమే. మందులు కూడా సరిగా ఉండవు. ఉన్నా అవి ప్రజలకు ఉపయోగపడవు. మంచి సదుపాయాలుండాల్సిన హాస్పిటల్స్‌లో బోధనా సిబ్బంది, తగినంతమంది ఉద్యోగులు లేక, ఉన్నా, వారిలో అంకితభావం లేక వెనుకబడి వున్నాయి. ప్రజారోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీనత దీనికి కారణం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అనివార్యంగా ప్రయివేటు డాక్టర్లను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈనేపథ్యంలో క్రమంగా వైద్యం ప్రయివేటుపరం అయిపోయి వ్యాపారీకరణకు దారి తీసింది. ప్రయివేటు మెడికల్ కాలేజీలు, మల్టీస్పెషాలిటీ వైద్య శాలలు పుట్టగొడుగుల్లా పెరిగి, అన్ని రకాల అవినీతి పద్ధతులకు పాల్పడుతున్నాయి. విద్యార్థులు, వినియోగదారుల నుండి అంతులేని డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్నాయి. డొనేషన్లు వసూలు చేయకూడదని చెప్పిన సుప్రీం ధర్మాసనం ఆదేశాన్నీ ఎవరూ పట్టించుకోవడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ ఆసుపత్రులు పచ్చివ్యాపార సంస్కృతికి తెరతీశాయి. పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పిస్తున్నాయి. పీఆర్‌ఓలను పెట్టుకుని తమ ఆసుపత్రికి కేసులు పంపిన వారికి ఆకర్షణీయమైన ప్రతిఫలాన్ని ఆశ చూపిస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించుకోవడానికి దొడ్డి దారుల్ని ఆశ్రయిస్తున్నాయి. ఈ దొడ్డిదారులు చాలా వికృతమైన రూపాలు ధరిస్తున్నాయి. అవసరానికి మించి ఎక్కువ ఖరీదైన మందులు రాయడం, అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల పరీక్షలు చేయించడం, అవసరంలేని ఆపరేషన్లు చేయడం, ప్రతి రెండో కేసునీ ఐసీయూలో పెట్టడం, వెంటిలేటర్ ఎక్కించడం లాంటి రోగుల జేబులు ఖాళీ చేయించే విధానాలు అవలంబిస్తున్నారు.

దీంతో సమాజంలోని అన్నిరంగాలకు భిన్నంగా ఉంటుందని ఆశించే వైద్యరంగం కూడా అవినీతి ఊబిలో పీకలదాకా కూరుకుపోయింది.

దీనికి తగినట్లుగానే ఔషధ పరిశ్రమలు విపరీతంగా పెరిగిపోయాయి. రకరకాల ఔషధాలను ఉత్పత్తి చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు వాటిని మార్కెటింగ్ చేయటానికి అనేక వక్ర మార్గాలు అవలంభిస్తున్నాయి. డాక్టర్లకు ఖరీదైన నజరానాలు సమర్పించడం, విందులు వినోదాల్లో ముంచడం, విదేశీటూర్లు వేయించడం, మరికొన్ని ఇతర కోరికలు, అవసరాలు తీర్చడం లాంటి నీచపు పనులన్నీ చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజల్లో వైద్యులు, వైద్య వృత్తి సందేహాస్పదంగా మారిపోయింది. వైద్య రంగంలో అత్యున్నత మానవీయ విలువలు పాటించే వారు ఈనాటికీ కోకొల్లలుగా ఉన్నప్పటికీ, కొందరివల్ల అందరికీ.., మొత్తం వైద్య వ్యవస్థకే చెడ్డ పేరు వస్తున్నది. అందుకని, వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని అత్యున్నత స్థాయిలో నిర్వహించాలి. కేవలం కళ్ళముందు కనిపించే కొన్ని తాయిలాలకే లొంగిపోకూడదు. తమ వద్దకు వచ్చిన పేషెంట్ పట్ల నిజాయితీగా వుండాలి. నిబద్ధతతో వ్యవహరించాలి. రోగిని చూసే పద్ధతి స్నేహ పూరితంగా, దయగా, వితరణతో కూడినదై వుండాలి. బంధువులకు, పేషెంట్ దగ్గర వుండే వారికి వాస్తవ పరిస్థితిని వివరించి ధైర్యం చెప్పాలి. వైద్యవ్యవస్థ మీకు అండగా ఉందన్న భరోసా కల్పించాలి. వైద్య వృత్తిని అమితంగా ప్రేమించి, శ్వాసించిన డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ (బీసీరాయ్ )ను ఆదర్శంగా తీసుకొని వృత్తిధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తూ, నిస్వార్థ ప్రజా సేవకు నడుంబిగించాలి. ప్రజల నిత్యజీవితంలో కీలకపాత్ర పోషించే వైద్యుల సేవలను గుర్తించి, వారి గొప్పతనంపట్ల అవగాహన పెంచడంకోసం డా. బీసీరాయ్ జయంతి, వర్ధంతి రోజు అయిన జులై 1 వ తేదీని 'డాక్టర్స్ డే'గా నిర్వహించడాన్ని వైద్యమహోదయులు గౌరవంగా, స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవకు పునరంకితం కావాలి. కొంత మందివల్ల మొత్తం వైద్య వ్యవస్థకే వస్తున్న చెడ్డపేరును తొలగించడానికి చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నం చెయ్యాలి. తమలో ఏవైనా లోటుపాట్లు ఉంటే గనక వాటిని సరిదిద్దుకొనే ప్రయత్నం చేయగలిగితే ప్రజల నమ్మకాన్ని, ప్రేమాభిమానాలను మరలా తిరిగి పొందడం అసాధ్యమేమీకాదు. ఏది ఏమైనా డాక్టర్లు గౌరవనీయులు, త్యాగధనులు, ప్రేమమూర్తులు. వ్యాపార దృక్పథాన్ని కాసేపు పక్కనబెట్టి, వారుతమ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి ప్రజలకు సేవ చేస్తున్నందుకు మనమంతా వారిని మనసారా అభినందిద్దాం. వారి సేవలను స్మరించుకుందాం. ✤

**నాటి ప్రజలు వైద్యుణ్ని నమ్మకమైన స్నేహితుడిగా, ఆత్మీయుడిగా, మార్గదర్శిగా విశ్వసించేవారు. తను కూడా వారి నమ్మకానికి అనుగుణంగా కుటుంబ శ్రేయోభిలాషిగా మసలుకునే వాడు. కాని ఈనాడు ఫ్యామిలీ డాక్టర్ అనే ఆలోచన పూర్తిగా మాయమైంది. డాక్టరు తన వృత్తిని బిజినెస్‌గా, పేషెంటును కస్టమర్‌గా భావించే పరిస్థితి ఏర్పడింది.**



# బాబిలోనియా నుండి బక్కా వరకు

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

.... మరోసారి ఖుర్బానీ పండుగను జరుపుకున్నాం. లక్షలాది మంది హాజీలు హజ్జ్ చేసి మక్కా పుణ్యపురి పొలిమేరల్లో ఇబ్రాహీమ్ త్యాగానికి సంకేతంగా ఖుర్బానీ సమర్పించుకున్నారు. అసలు ఖుర్బానీ హాజీలదే.

'ఖుర్బానీ' సందర్భంగా మనం దివ్య ఖుర్‌ఆన్‌లోని మూడు ఆయత్‌లను స్మరించుకుంటాము. ఇవి మూడూ అల్ అన్‌ఆమ్ అధ్యాయంలోనివే- వాటిలో ఒకటి: 79వ ఆయత్. తరువాతి రెండు ఆయత్‌లు 162, 163. మొదటి ఆయత్ మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ద్వారా ప్రకటించబడినది. తరువాతి రెండు ఆయత్‌లు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ద్వారా ప్రకటన గావించబడినవి.

సృష్టించబడిన వస్తువుల ఆరాధన పట్ల బాబిలోనియా (ఉర్)లో తన విసుగును, తెగత్రెంపులను ప్రకటిస్తూ ప్రవక్తల పితామహుడు (అ), తాను ఏకాగ్రతతో తన ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన వాని వైపునకు త్రిప్పుకున్నాననీ, తాను బహుదైవోపాసకుల సరసన చేరినవాణ్ణి కానని నిర్దిష్టంగా ప్రకటించగా, బక్కాలోని బహుదైవోపాసకుల షిర్క్ చేష్టలకు దీటుగా జవాబిస్తూ అంతిమ దైవప్రవక్త(స), 'నా నమాజ్, నా సకల ఉపాసనారీతులు, నా జీవనం, నా మరణం- సమస్తమూ సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్‌కే చెందుతాయి' అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తాను సేవించే ఆరాధ్య దైవం సహవర్తులెవరూ లేనివాడని, తనకు ఇవ్వబడిన ఆజ్ఞ ఇదేనని, ఆ నిజ ఆరాధ్య దైవం ముందు తల వంచేవారిలో తాను తొలి వాడనని కూడా నిర్మొగమాటంగా చాటి చెప్పారు మహోదయులు ముహమ్మద్(స).

ఆ మహనీయులిద్దరి సందేశం ఒక్కటే - ఏకేశ్వరోపాసనకు కట్టుబడటం, విశ్వేశ్వరుని సార్వభౌమత్వాన్ని శిరసావహించటం!

విశ్వాసాన్ని (ఈమాన్‌ను) మూఢ నమ్మకాల అంధకార లోయల్లో నుండి పైకెత్తి, దానిని కాంతి శిఖరాల ఉన్నతికి చేర్చటం!!

సకల చెడుగులకు మూలమైన 'షిర్క్'ను సమూలంగా పెకలించటం!!!

ఆ మహనీయులిద్దరూ తీవ్రంగా పరీక్షించబడ్డారు. ఇద్దరూ హిజ్రత్ చేశారు. వారిలో ఒకరు పవిత్ర కాబా గృహాన్ని నిర్మిస్తే, రెండవ వారు ఆ పవిత్ర కాబా గృహంలో ప్రతిష్టించబడిన విగ్రహాలను తొలగించి దానిని ప్రక్షాళనం చేశారు.

రండి, ఆ మహనీయులిరువురి 'మిషన్'లోని ప్రత్యేకతలను ఓసారి మననం చేసుకుందాము-

దైవగ్రంథం ఖుర్ఆన్‌లో మహనీయ ఇబ్రాహీమ్(అ) ప్రస్తావన ఎక్కడ వచ్చినా, అది చాలా ప్రత్యేకంగానే ఉంటుంది. అలాంటి ప్రస్తావనలోని నాలుగు వాక్యాలు అన్ నహ్ల్ సూరాలోనివి. *(120- 123)*

### ఇన్న ఇబ్రాహీమ కాన ఉమ్మహ్... (16: 120)

- ✦ అవును, నిశ్చయంగా ఇబ్రాహీమ్(అ) తనకు తానే ఒక సంఘం. ఆయన తన ఉనికి రీత్యా ఒకే వ్యక్తి కావచ్చు. కాని తన అసాధారణ త్యాగాల దృష్ట్యా, మొక్కవోని సాహసం రీత్యా, మిథ్యా వాదులకు వ్యతిరేకంగా జీవితాంతం సాగించిన రాజీలేని పోరాటం రీత్యా ఆయన ఒక్కరు కారు. ఆయన ఒక్కరే ఒక సంఘం. ఒక సైనిక పటాలం. ఆయన ఒక్కరే ఒక సంస్థ, ఒక వ్యవస్థ.
- ✦ అల్లాహ్‌కు పరమ విధేయుడు, ఏకాగ్రతతో అల్లాహ్ యందే మనసును లగ్నం చేసిన దాసుడు.
- ✦ షిర్క్‌కు బహుదూరంగా మసలుకున్న ఏక దైవారాధకుడు.

# పిరమిడ్ల గడ్డతో వారికి గల సంబంధం

పిరమిడ్ల గడ్డ ఈజిప్టు రాజ్యం అటు ప్రవక్త ఇబ్రాహీమ్(అ)కి, ఇటు ప్రవక్త ముహమ్మద్(స)కి కూడా అత్తవారిల్లే. అలనాడు- 4వేల ఏండ్ల క్రితం మహనీయ ఇబ్రాహీమ్(అ) సతీసమేతంగా ఈజిప్టు రాజ్యానికి వెళ్ళినప్పుడు అక్కడి రాజు సారా (అలైహస్సలామ్) సౌందర్యం గురించి విని, దురుద్దేశంతో ఆమెను తన కోరికి పిలిపించాడు. ప్రార్థనలో లీనమై ఉన్న సారాను సమీపించగానే అతని శరీరావయవాలు (పక్షవాతంతో) చచ్చుబడిపోయాయి. చివరికి అతను పశ్చాత్తాప పడటంతో దేవుడు అతనికి స్వస్థత చేకూర్చాడు. ఆ పుణ్య దంపతుల గొప్ప తనాన్ని తెలుసుకున్న ఆ ఐగుప్త దేశపు రాజు, వారికి రాజవంశానికి చెందిన హాజిరా (అలైహస్సలామ్)ను సేవకురాలిగా బహూకరించాడు. ఇబ్రాహీమ్ ఆమెను వివాహమాడారు. ఇబ్రాహీమ్-హాజిరా దంపతులకు పుట్టిన ముద్దు బిడ్డడే ఇస్మాయీల్. ఇస్మాయీల్ సంతతిలో పుట్టిన చిట్టచివరి ప్రవక్తే ముహమ్మద్(స).

కాగా; ఇబ్రాహీమ్ముని మనవడు, ఇస్రాయీల్ కుమారుడైన హజ్రత్ యూసుఫ్ (అ) ఈజిప్టులో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఆయన కూడా ఈజిప్టులోనే పెండ్లి చేసుకున్నారు.

హుదైబియా ఒడంబడిక అనంతరం మహాప్రవక్త



ముహమ్మద్(స) వివిధ దేశాల చక్రవర్తులకు సందేశ ప్రధానమైన లేఖలు వ్రాశారు. ఆ లేఖలను అందుకున్న వారిలో ఈజిప్టు చక్రవర్తి కూడా ఉన్నాడు. అతడు ఇస్లామ్ స్వీకరించలేదు గాని మహాప్రవక్త(స)ను ఆదరిస్తూ విలువైన కానుకలు పంపించాడు. ఆ కానుకల్లో **'మారియా ఖిబ్తియా'** అనే సేవకురాలు ఉన్నారు. ఆమె ఖిబ్తీ (ఫిరౌన్) వంశానికి చెందిన మహిళ. దైవప్రవక్త(స) అంతఃపురంలో **'మా మలకత్ అయ్‌మానుహుమ్'** కోవకు చెందిన మహిళగా ప్రవేశించారు. మహాప్రవక్త (స)కు హిజ్రత్ తరువాత- మదీనాలో- మారియా ఖిబ్తియా ద్వారా ఒకే ఒక మగపిల్లవాడు కలిగాడు. ఆ అబ్బాయికి మహాప్రవక్త పెట్టుకున్న పేరు **ఇబ్రాహీమ్(రజి)**. కాని పసితనంలోనే ఆ బాలుడు మరణించాడు.

## షాకిరన్ లి అన్‌వుమిహీ.... (16 : 121)

- ఆయన దైవానుగ్రహాల పట్ల సదా కృతజ్ఞతలు తెలుపుకున్న ధన్య జీవి.
- అందుకే అల్లాహ్ ఆయన్ని తన కార్యం కొరకు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు.
- రుజుమార్గం వైపునకు ఆయనకు మార్గబోధన చేశాడు.
- ఇహలోకంలో ఆయనకు అల్లాహ్ మేలును ప్రసాదించాడు. ఇక పరలోకంలోనైతే ఆయన సజ్జనుల సరసన ఉంటారు.

“నీవు ఆత్మ సమర్పణ చేసుకో” అని ప్రభువు ఆదేశించగానే, ‘నేను లోకేశ్వరుని సమక్షంలో బేషరతుగా ఆత్మ సమర్పణ చేసుకున్నాన’ని సమాధానమిచ్చిన పరమ విధేయుడు ఇబ్రాహీమ్(అ).

తన ప్రియ నేస్తమైన ఇబ్రాహీమ్(అ)ను అల్లాహ్ కొన్ని విషయాలలో పరీక్షించినప్పుడు, ఇబ్రాహీమ్ (అ) నూటికి నూరు శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

## ఎన్నెన్ని పరీక్షలు? ఎటువంటి కఠోర పరీక్షలు?

- కాలపు చక్రవర్తి ఆయన్ని అగ్ని గుండానికి ఆహుతి చేసినప్పుడు, ఆ మూర్తీభవించిన సాహసం దైవం పైనే భారం వేశారు.
- దైవ వాక్కు ఉన్నతి కోసం దేశ దేశాలు సంచరించారు.
- కట్టుకున్న ఇల్లాలిని, వృద్ధాప్యంలో కలిగిన పుత్ర రత్నాన్ని కటిక ఎడారిలో వదలిపోయారు.
- దేవుని సంకేతాన్ని పురస్కరించుకుని కన్న కొడుకుని మన స్ఫూర్తిగా దైవమార్గంలో బలి ఇవ్వడానికి సిద్ధమయ్యారు.

## ఫ అతమ్మహున్న

అవును, నికార్సుగా నెగ్గుకు వచ్చారు ఇబ్రాహీమ్(అ). దైవాజ్ఞలకు కార్యరూపం ఇచ్చి ఇచ్చి ఆయన మనసు కుదటపడింది. ఇబ్రాహీమ్(అ) పట్ల ఆయన ప్రభువు ప్రసన్నుడై ఉన్న శుభ ఘడియ అది! తన ప్రభువు పట్ల ఇబ్రాహీమ్(అ) కూడా సంతుష్టుడై ఉన్న శుభ సమయమది!! కాల చరిత్రకు ఓ గొప్ప సంకేతం ఇవ్వబడుతున్న కీలక ఘట్టమది!!! ఆ శుభ ఘడియలో పరమ ప్రభువు తన ప్రియ నేస్తం (ఖలీల్)తో ఊసులాడాడు..

## ఇన్నీ జాయిలుక లిన్నాసి ఇమామా (2: 124)

“(ఇబ్రాహీమ్!) నేను నిన్ను సమస్త మానవాళికి పీష్వాగా, నాయకునిగా చేయబోతున్నాను!”




ఇది మామూలు శుభవార్త కాదు. జీవిత కాల సాఫల్య పురస్కారం (Life Time Achievement Award) కన్నా గొప్ప అవార్డు ఇది. అయితే ఈ అవార్డుకు ఇబ్రాహీమ్(అ) ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవలేదు. ‘ధన్యోస్మి స్వామి!’ అనీ అనలేదు. ఎందుకంటే ఆ క్షణంలో ఆ మహనీయుని దృష్టి ‘ప్రెజెంట్’పై లేదు. ఆయన దృష్టి అంతా ‘ఫ్యూచర్’పైనే ఉంది. మహనీయులు సర్వదా దూర దృష్టితోనే ఆలోచిస్తారు. ఎందుకంటే పైగంబరులు సదా మానవ శ్రేయోభిలాషులై ఉంటారు. అందుకే ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీమ్(అ) ఇలా అడిగారు-

## వ మిన్ జుర్రియ్యతీ!? (2: 124)

“ప్రభూ! నీ ఈ వాగ్దానం, వరం నా సంతానానికి కూడా వర్తిస్తుందా?”

ఈ పలుకుల్లో ఎంతో ఆర్ద్రత ఉంది. పిచ్చి ఆశ ఉంది. ఆరాటం ఉంది. మానవ శ్రేయోభిలాష నిబిడీకృతమై ఉంది. మరి ఇబ్రాహీమ్(అ) సందేశానికి ఆయన ప్రభువు ఇచ్చిన సమాధానం కూడా గమనించదగినదే-

## లా యనాలు అహ్‌దిజ్జాలిమీన్ (2: 124)

**(ఇబ్రాహీమ్! ఒక విషయం బాగా గుర్తుంచుకో)**

- నా వాగ్దానం దుర్వర్తనులకు వర్తించదు.
- అసమర్థులు, అనర్హుల విషయంలో నా వాగ్దానం నెరవేరదు.
- అప్పగింతల్లో ద్రోహానికి (ఖియానత్‌కు) పాల్పడి, దైవ గ్రంథంలో ప్రక్షిప్తాలు చేసి, సత్యాన్ని కప్పిపుచ్చే అబద్ధీకులకు నా ఈ వరం వరించదు.
- యోగ్యులైన వారికి, నిజాయితీపరులకు, రుజువర్తనులకు మాత్రమే నా ఈ వాగ్దానం వర్తిస్తుంది.

చూశారా! ప్రవక్తల సంతానం అయినంత మాత్రాన అది -‘అర్హత’కు ప్రమాణం కాదు. ఇక్కడ కూడా సర్‌వైవల్

ఆఫ్ ది ఫిట్టెస్ట్ ఫార్ములా (Survival of the Fittest Formula)యే వర్తిస్తుంది.

'ఫిట్' కన్నా 'ఫిట్టర్'కు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 'ఫిట్టర్'కన్నా 'ఫిట్టెస్ట్' వైపునకే మొగ్గు చూపటం జరుగుతుంది. అటు ఫిట్టెస్టూ (Fittest) కాకుండా ఇటు ఫిట్టర్ (Fitter) కూడా కాకుండా, కనీసం ఫిట్ (Fit) కూడా కాకుండా 'అన్‌ఫిట్' (Unfit)గా ఉన్న వారికి ఈ 'సేవా భాగ్యం' దక్కదు. ఇది దైవ సంప్రదాయం. ఇందులో తిరుగులేదు.

## ఆమోద ముద్ర పొందిన ఆ ప్రార్థన

మహనీయ ఇబ్రాహీమ్(అ)కు విషయం సుబోధకం అయింది. ఆయన దైవకారుణ్యం పట్ల ఆశ వదులుకోలేదు. నీరూ, పచ్చికా లేని బక్కా (మక్కా) లోయలో ఆయన తన భార్య హాజిరాను, తన కుమారుడు ఇస్మాయీల్(అ)ను వసింపజేసిన మీదట, అక్కడ కాబా గృహం గోడలను ఎత్తుతూ చేసిన సుదీర్ఘమైన ప్రార్థనలో ఒక వాక్యం ప్రత్యేకంగా గమనించదగినది. ఆయన ఇలా వేడుకున్నారు : "ప్రభూ! నీవు వీరి జాతిలో నుండి (ఇస్మాయీల్ సంతతిలోనుండి) ఒక ప్రవక్తను ప్రభవింపజెయ్యి. ఆ ప్రవక్త వీరికి 1) నీ వాక్యాలు చదివి వినిపించాలి 2) నీ గ్రంథ జ్ఞానాన్ని బోధించాలి. 3) విజ్ఞతా వివేచనలను విశదీకరించాలి. 4) వీరి అంతరంగాలను పరిశుద్ధపరచాలి, వీరి జీవితాలను తీర్చిదిద్దాలి." (2: 129)

ఇబ్రాహీమ్(అ) మొర ఆలకించబడింది. ఆ వేడుకోలు యథాతథంగా ఆమోదించబడింది. ఆ విషయమే అల్ జుముఅహ్ సూరాలో ఇలా సెలవీయబడింది: "ఆయనే (అల్లాహ్‌యే) నిరక్షరాస్యులలో (ఉమ్మీలలో) ఒక ప్రవక్తను (ముహమ్మద్‌ను) స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి 1) ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు 2)వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు 3) వారికి గ్రంథాన్ని బోధిస్తున్నాడు 4) వివేకాన్ని, యుక్తినీ వివరిస్తున్నాడు." (62: 2)

**"నేను ఇబ్రాహీమ్(అ) ప్రార్థనా ఫలాన్ని"** అని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చెబుతూ ఉండేవారు, తన ముత్తాత, ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీమ్(అ) త్యాగానికి గుర్తుగా 'ఈదుల్ అజ్‌హా' రోజున ఖుర్బానీ ఇవ్వమని ఆయన(స) తన సహచరులకు బోధించారు. 'ఏమిటి, ఈ ఖుర్బానీ' అని ప్రియ సహచరులు (రజి) విన్నవించుకోగా, "ఇది మీ తండ్రి ఇబ్రాహీమ్ సున్నత్ (సంప్రదాయం)" అని స్పష్టం చేశారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) దేవుని చిట్టచివరి ప్రవక్త. అయినప్పటికీ ఇబ్రాహీమ్(అ)ను అనుసరించమని ఆయన(స)కు ఆదేశం అందటం విశేషం!

ఇదిగో, అన్ నహ్ల్ సూరాలో ఇలా సెలవీయబడింది :

> **"(ఓ ముహమ్మద్!) ఏకాగ్రచిత్తుడవై ఇబ్రాహీమ్ విధానాన్ని అనుసరించు- అతను ముష్రిక్కులలోని వాడు కాడు" అనే 'వహీ'ని నీ వద్దకు పంపాము. (16: 123)**

ఇక, సర్వసామాన్యంగా ప్రపంచ ముస్లిములందరినీ ఉద్దేశించి ఇవ్వబడిన దైవాజ్ఞ కూడా గమనార్హమే.

**మిల్లత అబీకుమ్ ఇబ్రాహీమ్ (22: 78)**

(ముస్లిములారా!) మీరు మీ తండ్రి ఇబ్రాహీమ్ పద్ధతిపై స్థిరంగా ఉండండి.

**హువ సమ్మాకుముల్ ముస్లిమీన్- మిన్ ఖబ్లు**

పూర్వం కూడా అల్లాహ్ మీకు 'ముస్లిమ్' అనే పేరునే పెట్టాడు.

**వ ఫీ హాజా**

ఇందులో (ఖుర్‌ఆన్‌లో) కూడా మీ పేరు ఇదే.

ఎందుకు? ఎందుకంటే-

**లి యకూనర్రసూలు షహీదన్ అలైకుమ్ వ తకూనూ షుహదాఅ అలన్నాస్.**


దైవప్రవక్త మీపై సాక్షిగా ఉండటానికి! మీరేమో సమస్త మానవాళి విషయంలో సాక్షులుగా ఉండటానికి!!

"ఏ ఖౌమ్ అప్నె బరాహీమ్‌కి
తలాష్‌మె హై
సనమ్ కదాహై జహాఁ
లా ఇలాహ ఇల్లల్లాహ్"

✤


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

'చరితార్థులు'-2



# నవాబ్ మిర్జా షంసుద్దీన్ అహ్మద్ ఖాన్

## (1760-1835)




5



9440241727

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

**మలబారు** తీరప్రాంతాన సామాన్య రైతుల కష్టాన్ని జలగలా పీల్చుతున్న 'జెమ్మీలు'గా పరిగణించబడుతున్న భూకామందులు, ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు, అలవిగానంత వడ్డీ వసూలు చేస్తున్న మహాజనులకు వ్యతిరేకంగా ప్రజలను పోరుబాట నడిపిన ధార్మిక పండితులు సయ్యద్ అలావి తంగల్ 1752లో యమన్ దేశంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు షేక్ ముహమ్మద్ బిన్ సాహల్ తల్లిపేరు ఫాతిమా. చిన్నతనంలో తల్లితండ్రులను కోల్పోయిన సయ్యద్ అలావి పినతల్లి సంరక్షణలో పెరిగి 8 సంవత్సరాల వయస్సులో ఖురాన్ గ్రంథాన్ని ఆపోసన పట్టారు. ఆ తరువాత సాంప్రదాయక ధార్మిక విద్యను అభ్యసించిన ఆయన తన పినతండ్రులు హసన్ జిఫ్రి, షేక్ జిఫ్రిలతో పాటుగా ధార్మిక ప్రచారం లక్ష్యంగా కేరళ రాష్ట్రంలోని మలబారు తీరప్రాంతాన్ని చేరుకున్నారు. పదిహేడు ఏండ్ల వయస్సులో కాలికట్ చేరుకున్న సయ్యద్ అలావి తంగల్ స్థానికంగా ధార్మిక–సామాజిక సమస్యల మీద మార్గదర్శకం చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. ఆ ప్రాంతపు జమాలుద్దీన్ మగ్దూమి కుమార్తె ఫాతిమాను ఆయన వివాహం చేసుకుని ప్రస్తుత కేరళ రాష్ట్రం మలప్పురంలో భాగమైన మంబురం లో స్థిరపడ్డారు. ఆ కారణంగా ఆయన 'మంబరం తంగల్ / అరబి తంగల్'గా ప్రసిద్ధులయ్యారు. సయ్యద్ అలావి తంగల్ ధార్మికరంగం వరకు మాత్రమే పరిమితం కాలేదు. అన్ని రకాల ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి సల్పారు. ఆనాడు మలబారు తీరప్రాంతంలోని జెమ్మీలు సామాజికంగా, ఆర్థికంగా సామాన్య రైతులను ఏ విధంగా ఇక్కట్ల పాల్జేస్తున్నది స్వయంగా గమనించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారుల అండదండలతో భూకామందులైన జెమ్మీలు, వడ్డీ వ్యాపారులైన మహాజనులు ప్రజల మీద సాగిస్తున్న దాష్టీకాల నివారణకు పోరాటం ఒక్కటే మార్గమని ఆ దిశగా బాధిత ప్రజానీకాన్ని సమాయత్తం చేశారు. ఆధునిక ఆయుధాల వాడకం, సాంప్రదాయక యుద్ధ విద్యలలో శిక్షణ గరపటం ప్రారంభించారు. ఈ మేరకు రూపు దిద్దుకున్న పోరాట దళాలు 1836, 1837 ప్రాంతాలలో ఎర్నాడు ప్రాంతంలో భూకామందుల కిరాయి మూకలు, కంపెనీ అధికారుల పోలీసు బలగాలతో ఘర్షణ పడ్డాయి. ఈ సంఘర్షణలు బాధిత మొప్లా రైతాంగంలో ఆత్మవిశ్వాసం పెంచడంతో పలు ప్రాంతాలలో ప్రజలు ఆంగ్లేయాధికారుల ఆదేశాలను ఉల్లంఘించడం ఆరంభించారు. ఈ ప్రతికూల పరిస్థితుల పట్ల కంగారు పడిన ఆంగ్లేయాధికారులు మరింతగా పోలీసు, సైనిక బలగాలను రప్పించి ప్రజలను నిర్బంధించి, కాల్పులు జరిపించి భయానక హింసాకాండకు పాల్పడినా, ప్రజలు మాత్రం పోరుబాట వీడలేదు. ఆంగ్లేయుల, జెమ్మీల, మహాజనుల దోపిడి, అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజల పోరాటాలకు మార్గదర్శకం చేస్తూ బాధిత మోప్లా రైతాంగం, సామాన్య ప్రజల పక్షాన చివరి వరకు నిలచిన సయ్యద్ అలావి తంగల్ 1845లో కన్ను మూసారు.




**ఆజ్ తక్** హిందీ వార్తా సంస్థ గ్రూపుకు చెందిన యు.పీ.తక్ రిపోర్టుగా కనిపిస్తున్న ఒక చిత్రం వైరల్ అయ్యింది. ఈ చిత్రంతో పాటు ఏం రాశారంటే, ఆరుగురు ముస్లిం యువకులు ఒక దళిత మహిళను మతం మార్చుతామని, రేప్ చేస్తామని బెదిరించారట, ఆ దళిత మహిళ ఆగ్రహంతో వారందరి తలలు నరికి పారిపోయిందంట. ఉత్తరప్రదేశ్‌లోని బాబత్‌పూర్‌లో ఈ సంఘటన జరిగినట్లు రాశారు. ఆ దళిత మహిళ బంధువులు ఈ విషయమై గతంలో పోలీసులకు రిపోర్టు చేసినా పోలీసులు ఎలాంటి చర్య తీసుకోలేదని కూడా రాశారు. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, పోలీసులు ఈ వార్తను ఖండించారు. ఈ సంఘటన జరిగిన ఊరికి సంబంధించిన పోలీసు జోన్ డిసీపి ఈ వార్తను ఖండించారు. కొన్ని ట్విటరు పోస్టుల్లో ఈ ఫేక్ వార్త వస్తుందని, ఆరుగురిని తల నరికి ఒక దళిత మహిళ చంపిందన్న వార్త అబద్ధమని, ఆరుగురి తలలు బాబత్‌పూర్ కాళీ మందిరంలో దొరికాయన్న వార్త కూడా అబద్ధమని తెలిపారు. అలాంటి సంఘటన ఏదీ జరగలేదని స్పష్టం చేశారు. మరో ఫేక్ వార్త ఏమిటంటే, ఒక ధార్మిక ప్రదేశంలో కొందరు ప్రార్థనలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది. భారతదేశం నాశనం కావాలని భారత ముస్లిములు ప్రార్థిస్తున్నారని దాని కింద రాశారు. ఈ వీడియోను షేర్ చేసిన మరికొందరు ఈ ముస్లిములు బీజేపీ ఓడిపోవాలని, భారతదేశంలో ఆరెస్సెస్ తుడిచిపెట్టుకు పోవాలని ప్రార్థిస్తున్నారని రాశారు. ది క్వింట్ వార్తాసంస్థ నిజ నిర్ధారణలో తేలినదేమిటంటే బీజేపీ ఓటమి కోసం ప్రార్థనలు చేశారన్నది నిజమే, కాని భారతదేశ వినాశం కోసం ప్రార్థనలు చేశారన్నది అబద్ధం. పైగా ఇది ఇప్పటి వీడియో కాదు, ఇది 2019లో కూడా కనిపించింది. అప్పట్లో ప్రధాని మోడీ పాలనకు బదులు అల్లాహ్ పాలన కోసం ముస్లిములు ప్రార్థిస్తున్నారని ప్రచారం చేశారు. ఇంకో ఫేక్ వార్త కూడా చూద్దాం. ఘాజియాబాద్‌కు చెందిన ఆషా అనే అమ్మాయిని ఆమె ప్రేమికుడు క్రూరంగా చంపేశాడని రాశారు. ఆ ప్రేమికుడి పేరు నదీం అని రాశారు. అంటే ముస్లిం. ఎందుకు చంపాడంటే ఆమె మతం మార్చుకోడానికి ఇష్టపడలేదు కాబట్టి చంపేశాడట. దీన్ని లవ్ జిహాద్‌గా ప్రచారం చేశారు. ఆల్ట్ న్యూస్ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, సుమన్ లేదా ఆషా దేవీ తన భర్తతో పిల్లలతో వేరుపడి ఒంటరిగా నివసించేది. ఆమెకు నదీం అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారింది. అయితే ఆమెకు అనేకమంది మగవాళ్ళతో సంబంధాలున్నాయని నదీం గుర్తించాడు. ఆ కోపంలో ఆమెను హతమార్చాడు. ఇది ఒక ప్రేమోన్మాది చేసిన హత్య. దీనికి లవ్ జిహాద్ కోణం ఏదీ లేదు. ఈ సంఘటన జరిగింది ఇప్పుడు కాదు సంవత్సరం క్రితం. ఇంకో ఫేక్ వార్త ఏమిటంటే, విన్ స్టన్ చర్చిల్ తర్వాత అమెరికా కాంగ్రెసు జాయింట్ సెషన్‌లో రెండు సార్లు మాట్లాడిన నేత మోడీ మాత్రమే అన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇది అబద్ధమని స్పష్టంగా తెలుస్తున్న వార్త, ఇస్రాయీల్ నాయకుడు నెతన్యాహు అమెరికా కాంగ్రెస్ జాయింట్ సెషన్‌లో మూడుసార్లు మాట్లాడాడు. దక్షిణాఫ్రికా నేత నెల్సన్ మండేలా రెండుసార్లు మాట్లాడారు. రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, వాజపేయి, మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా అమెరికా కాంగ్రెస్ జాయింట్ సెషనులో మాట్లాడారు. అమెరికా కాంగ్రెస్ జాయింట్ సెషన్లు ఏర్పాటు చేసి విదేశీ అధినేతలకు అక్కడ మాట్లాడే అవకాశం కల్పించడం అనేది ఇప్పటికి వందసార్లకు పైబడి జరిగింది. దాదాపు 48 దేశాలకు చెందిన అధినేతలు ఈ జాయింట్ సెషన్లలో మాట్లాడిన చరిత్ర ఉంది. ఫ్రాన్స్ పాలకులు 9 సార్లు ఈ జాయింట్ సెషన్లలో మాట్లాడారు. ఇస్రాయీల్ ప్రధానులు 8 సార్లు ఈ జాయింట్ సెషన్లలో మాట్లాడారు. బ్రిటన్ ప్రధానులు కూడా 8 సార్లు మాట్లాడారు. ఇండియా, మెక్సికో పాలకులు 7సార్లు ఈ జాయింట్ సెషన్లలో పాల్గొన్నారు.

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

5 – 6 అనతి కాలంలోనే ఆకాశాలు పైనుంచి విరుచుకుపడనున్నాయి.[3] దైవదూతలు తమ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతని కొనియాడుతూ ఉన్నారు, భూవాసుల కొరకు మన్నింపునకై వేడుకుంటూ ఉన్నారు.[4] తెలుసుకోండి, వాస్తవానికి అల్లాహ్ క్షమాశీలుడు కరుణామయుడే.[5] ఎవరయితే ఆయన్ని వదలి, కొందరు ఇతరుల్ని తమకు సంరక్షకులు[6] గా చేసుకున్నారో, అల్లాహ్ స్వయంగా వారిని కనిపెట్టుకు ఉన్నాడు, నీవు వారి పట్ల బాధ్యత గలవాడివి కావు.

3. ఇదేమీ సాధారణ విషయం కాదు. సృష్టిరాశిలో ఒక వ్యక్తి వంశ సంబంధాన్ని దైవంతో కలిపి వారిని దైవానికి కుమారుడు గానో లేదా కుమార్తెగానో నిర్ణయించడం, ఒకరిని అక్కరలను తీర్చేవానిగా, మొరలాలకించేవానిగా పరిగణించి, అతని సన్నిధిలో ప్రార్థనలు జరపడం, పైగా ఆ మహనీయుణ్ణి ప్రపంచం మొత్తాన పనులు చేసి పెట్టే వానిగా భావించడం, తమ మహాత్ముడు, అన్ని వేళలా, ప్రతి వ్యక్తినీ వింటాడని, ఆయనే ప్రతి ఒక్కరి సహాయానికి చేరుకుని ఎల్లరి పనులు చేసిపెడతాడని ప్రకటించడం, ఒకరిని విధి నిషేధాలను, ధర్మాధర్మాలను నిర్ణయించే అధికారంగల వానిగా నమ్మి, జనులు దైవాన్ని వదలి ఆయనే తమ దైవంగా ఆయన ఆదేశాలనే అనుసరించడం – ఇవన్నీ దైవానికి సదృశంగా చేసే దుస్సాహసాలు. వీటికి ఫలితంగా ఆకాశాలు విరుచుకుపడినా అసంభవం ఏమీ కాదు. (ఇదే విషయం మర్యమ్ సూరా 88–91వ ఆయత్‌లలోనూ సెలవీయబడింది).

4. భావమేమిటంటే, దైవదూతలు మానవుల ఈ మాటలు వింటూ చెవులు మూసుకుంటున్నారు. మా ప్రభువును గురించి ఏమిటీ ఈ వాగుడు, భువిలోని ఈ సృష్టిరాశి చేస్తున్న ఈ తిరుగుబాటు ఏమిటీ అని వారు అనుకుంటున్నారు, సుబ్‌హానల్లాహ్, (పవిత్రుడు, పరిశుద్ధుడు మా ప్రభువు) నిఖిల జగతికి ప్రభువయిన వానితో పాటు దైవత్వంలోనూ, ఆజ్ఞలోనూ భాగం పంచుకోవడం ఎవరి తరం? ఆయన తప్ప మాకూ, సమస్త దాసులకూ మహోపకారి మరెవరు కాగలరు– ఆయన స్తోత్రగానం చేయడానికీ, ఆయనకు కృతజ్ఞతలు అర్పించుకోవడానికి? ఇటువంటి మహాపాతకం ప్రపంచంలో కొనసాగుతోంది, దీనికి ప్రభువాగ్రహం ఏ క్షణానయినా రగులుకోవచ్చు అని వారు భావిస్తారు. అందువల్ల వారు భువిలో నివసించే, ఆత్మ విస్మరణకు, దైవ విస్మరణకు గురయిన ఈ దాసుల విషయంలో మాటిమాటికీ, కరుణ చూపాలని దైవానికి ప్రాధేయపడుతూ ఉంటారు, ఇప్పుడే వారికి శిక్ష విధించరాదని, వారు సంస్కరించుకుని కుదుటపడే అవకాశం ఇంకా కాస్త ఇవ్వాలని వేడుకుంటూ ఉంటారు.

5. అంటే, ఇది ఆయన సహనం, సంయమనం, కారుణ్యం, క్షమాగుణం, మన్నింపు వైఖరుల మూలంగానే కదా తిరస్కారం, బహుదైవారాధన, నాస్తికత్వం, పాపాలు, అపరాధాలు, అన్యాయాలు, అక్రమాలలో హద్దులు మీరి ప్రవర్తించేవారు సయితం ఏళ్ళ తరబడి కొనసాగుతూ ఉంటారు. అంతేకాదు, ఇటువంటి పూర్తి సమాజాలు శతాబ్దుల తరబడి వ్యవధి పైన వ్యవధి పొందుతూ ఉంటాయి. వారికి కేవలం ఉపాధి ప్రాప్తమవడమే కాదు, ప్రపంచంలో వారి పెద్దరికపు నగారాలు మ్రోగుతుంటాయి, ప్రపంచ జీవితపు సకల సోయగాల సరంజామా కూడా వారికి ప్రాప్తమవుతూ ఉంటుంది, దీన్ని చూసుకుని వివేచనా హీనులయిన జనం అపోహలో పడిపోతారు, బహుశా ఈ ప్రపంచానికి దేవుడనేవాడు లేడేమోనని!

6. మూలంలో ఔలియా అనే పద ప్రయోగం జరిగింది. దీని భావం అరబీ భాషలో చాలా విస్తృతమయినది. మిథ్యా దేవుళ్ళను గురించి దారి తప్పిన మానవుల విభిన్నమయిన నమ్మకాలు, అనేక విభిన్నమయిన వైఖరులున్నాయి. వాటిని దివ్య ఖుర్‌ఆన్ "అల్లాహ్‌ను కాదని ఇతరుల్ని తమ 'వలీ'గా చేసుకోవడం" అని నిర్వచిస్తుంది. పవిత్ర ఖుర్‌ఆన్‌ని అనుసరిస్తే 'వలీ' అనే పదానికి దిగువ భావాలు ద్యోతకమవుతాయి.

(1) ఎవరు చెప్పిన విధంగా మనిషి నడచుకుంటాడో, ఎవరి నిర్దేశనలను అమలుపరుస్తాడో, ఎవరు నిర్ణయించిన విధానాలను, రీతులను, శాసనాలను, నియమాలను అనుసరిస్తాడో అతను. (*అన్ నిసా: 118–120 అల్ ఆరాఫ్:3, 27–30*).

**( 6వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ أَحَادِيثِ الْأَنْبِيَاءِ

## 1. దైవప్రవక్తల (హదీసుల) ప్రకరణం

## హదీసు వెలుగులో గుహవారు

**125)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "పూర్వ కాలం (ఇస్రాయీల్ సంతతి)లో జరిగిన ఒక సంఘటన– ముగ్గురు వ్యక్తులు ఒక దారి గుండా నడిచిపోతుండగా, అకస్మాత్తుగా వర్షం కురిసింది. అందువల్ల వారు ముగ్గురూ ఒక పర్వత గుహలోకి ప్రవేశించారు. వారు గుహలోపలికి వెళ్ళగానే (కొండచరియ విరిగిపడి) గుహ ముఖ ద్వారం మూసుకుపోయింది. అప్పుడు వారు ముగ్గురూ పరస్పరం ఇలా చెప్పుకున్నారు: 'దైవసాక్షి! ఇప్పుడు మనం ఇక్కడినుండి బయట పడే మార్గం ఒక్కటే– మనం సత్యాన్ని ఆశ్రయించాలి. మనలోని ప్రతి వ్యక్తీ తన సదాచరణలను గుర్తు చేసుకుని– వాటి ఆధారంగా– దుఆ చేయాలి. కేవలం దైవప్రసన్నతను చూరగొనడానికి చేసిన సత్కార్యం ఆధారంగా దైవ సహాయం అర్థించాలి.'

అందువల్ల వారిలోని ఒకడు ఇలా వేడుకున్నాడు: 'దేవా! నీకు తెలుసు. నేను ఒక కూలివాణ్ణి పెట్టుకున్నాను. నేను అతన్ని ఒక ఫర్ఖ్ (మూడు 'సా'ల) ధాన్యంపై మాట్లాడుకున్నాను. అతను పని చేశాడు. కాని అతను నాతో గొడవపడి, కోపంతో కూలి తీసుకోకుండానే వెళ్ళిపోయాడు. నేను ఆ ధాన్యంతో సేద్యం చేశాను. అందులో ఎంత సమృద్ధి జరిగిందంటే; దాంతోనే నేను ఆవులు, ఎద్దులు కొనుగోలు చేశాను. అయితే చాలాకాలం తర్వాత ఆ వ్యక్తి వచ్చి, తన కూలి అడిగాడు, దానికి నేను, 'ఇదిగో, ఇక్కడ ఉన్న ఆవులు, ఎద్దులు అన్నీ నీవే. వీటిని తోలుకుపో' అన్నాను. 'నాకు ముట్టవలసినది ఒక్కగానొక్క ఫర్ఖ్ ధాన్యమే కదా!' అని అతను అన్నాడు. 'ఫరవాలేదు, ఈ పశువులన్నింటినీ తోలుకుపో. ఆ ఒక్క ఫర్ఖ్ ధాన్యంతోనే ఈ వృద్ధి జరిగింద'ని నేనన్నాను. ఆ వ్యక్తి సంతోషంతో ఆ పశువులను తోలుకుని వెళ్ళాడు. 'దేవా! కేవలం నీ ప్రసన్నత కొరకే, నీ భీతితోనే నేనిలా నిజాయితీగా వ్యవహరించానన్న విషయం నీకు తెలిస్తే గుహ ముఖం తెరువు' అని ఆ వ్యక్తి వేడుకున్నాడు. అప్పుడు ఆ గుహ ముఖ ద్వారంపై పడి ఉన్న రాయి కొద్దిగా జరిగింది.

తరువాత రెండవ వ్యక్తి ఇలా ప్రార్థించాడు: 'దేవా! నా తల్లిదండ్రులు వృద్ధాప్యానికి చేరుకున్నప్పటి నుండీ నేను ప్రతి రోజూ రాత్రి వారికి మేక పాలు త్రాపిస్తూ ఉండేవాణ్ణి అన్న సంగతి నీకు బాగా తెలుసు. కాని ఒక రోజు నేను ఇంటికి వచ్చేసరికి ఆలస్యమైంది. అప్పటికే వారిద్దరూ నిద్రలోకి జారుకున్నారు. మరోవైపు నా ఆలుబిడ్డలు ఆకలితో అలమటిస్తున్నారు. కాని నా తల్లిదండ్రులు పాలు సేవించేవరకూ భార్యాబిడ్డలకు పాలు సమకూర్చేవాణ్ణి కాను. గాఢ నిద్రలో ఉన్న తల్లిదండ్రులను మేల్కొల్పటం సముచితం కాదనుకున్నాను. అలా అని అక్కడి నుండి వెళ్ళడానికి కూడా నాకు మనసొప్పలేదు (ఎందుకంటే పాలు మాత్రమే వారి రాత్రి భోజనం. అది కూడా త్రాగకపోతే వారు నీరసించిపోవచ్చు). అందువల్ల తెల్లవారే వరకూ అక్కడే నిలబడి పోయాను. నీ భయం వల్లనే నేను ఇలా చేశానన్న విషయం నీకు గనక తెలిసివుంటే, మమ్మల్ని ఈ గండం నుండి గట్టెక్కించు'. అప్పుడు ఆ గుహ ముఖంపై పడివున్న ఆ రాయి మరి కాస్తంత జరిగింది. దాంతో వారికి ఆకాశం కానవచ్చింది.

తరువాత మూడవ వ్యక్తి ఇలా వేడుకున్నాడు: 'దేవా! నా పినతండ్రి కుమార్తె ఒకామె ఉండేది. నేనామెను ఎంతగానో ఇష్టపడ్డాను. ఒకసారి ఆమెతో రమించాలని కోరుకున్నాను. కాని ఆమె నిరాకరించింది. అయితే ఆమెకు డబ్బు అవసరం ఏర్పడింది. వంద దీనార్లు ఇచ్చేటట్లయితే నా కోర్కె తీరుస్తానని అంది. నేను ఎంతో ప్రయాసతో ఆ డబ్బును

సమకూర్చి ఆమెకు అందజేశాను. ఆమె తన్నుతాను నాకు అర్పించుకోవడానికి సిద్ధపడింది. తీరా నేను ఆమె రెండు తొడల మధ్య కూర్చుని సమాగమం జరుపబోగా, 'అల్లాహ్‌కు భయపడు. అధర్మంగా నా కన్యాత్వ పొరను చించకు' అని ప్రాధేయపడింది. అంతే, (ఆ మాట వినగానే) నేను నిలబడిపోయాను. ఆమెకు ఇచ్చిన వంద దీనార్లను కూడా తిరిగి తీసుకోలేదు. దేవా! నీ భీతి వల్లనే నేను ఇలా చేశానన్న విషయం నీ జ్ఞాన పరిధిలో ఉంటే మా కష్టాన్ని సులభతరం చెయ్యి'. అంతే, అల్లాహ్ వారి కష్టాన్ని తొలగించాడు. వారు ముగ్గురూ ఆ గుహ నుండి బయటపడ్డారు.[1]

## అధ్యాయం : 48

**126)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా, హజ్రత్ అబూ హురైరా (రజి) విని తెలియజేశారు: "ఒక స్త్రీ తన పసిపిల్లవానికి పాలు త్రాపుతూ ఉండగా, ఒక రౌతు అటు వైపు నుండి సాగిపోయాడు. అతన్ని చూసినప్పుడు ఆ స్త్రీ తన పిల్లవానికి పాలు త్రాపుతూ, 'దేవా! నా పిల్లవాణ్ణి ఈ రౌతులాగా చేయనంత వరకూ ఇతనికి చావునివ్వకు' అని వేడుకుంది. అప్పుడు ఆ పసిపిల్లవాడు (దైవాజ్ఞతో మాట్లాడుతూ) 'దేవా! నన్ను మాత్రం అతనిలాగా చెయ్యకు' అని చెప్పి మళ్ళీ పాలు త్రాగటంలో నిమగ్నుడైపోయాడు, ఆ తరువాత (తెలియని) ఒక స్త్రీ అటువైపు నుంచి తీసుకుపోబడింది. జనులు ఆమెను ఈడ్చుకుంటూ, పరిహసిస్తూ పోతున్నారు. అది చూసి, 'దేవా! నా పిల్లవాణ్ణి ఈ దౌర్భాగ్యురాలిగా చేయకు' అని ప్రార్థించింది ఆ తల్లి. కాని ఆ పిల్లవాడు, 'దేవా! నన్ను ఆ స్త్రీ మాదిరిగానే చెయ్యి' అన్నాడు. నువ్విలా ఎందుకు ప్రవర్తిస్తున్నావు? అని తల్లి అడిగితే, '(అమ్మా) ఆ రౌతు ఒక అవిశ్వాసి, దౌర్జన్యపరుడు. ఇక ఈ స్త్రీ అంటావా, ఈమె వ్యభిచారం చేయిస్తోందని జనులంటున్నారు. దానికి జవాబుగా ఆమె **హస్బియల్లాహు** (నాకు అల్లాహ్ చాలు, నా సౌశీల్యం గురించి ఆయనకు బాగా తెలుసు) అని అంటోంది. జనులు ఆమెను దొంగతనం చేస్తోందని నిందిస్తున్నారు. దానికి జవాబుగా ఆమె **హస్బియల్లాహు** (నాకు అల్లాహ్ చాలు, నా గుణశీలం గురించి ఆయనకు బాగా తెలుసు) అని అంటోంది'[1] అని అన్నాడు.

125-1. ఈ హదీసుకు వ్యాఖ్యానంగా హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) ఇలా అంటున్నారు :

"ఈ హదీసు ద్వారా 'చిత్తశుద్ధి'కి గల మహత్తు ఎటువంటిదో స్పష్టమవుతోంది. తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగటం, వారి సంతోషం కొరకు శాయశక్తులా కష్టాన్ని భరించటం సంతానం కర్తవ్యం. తన పిల్లలు ఏడుస్తూ ఉన్నప్పటికీ ఆ వ్యక్తి లెక్కచేయ కుండా తల్లిదండ్రుల వద్దనే నిలబడి ఉండటానికి కారణం తెలియజేయబడింది. ఖర్చు పెట్టే విషయంలో తల్లి దండ్రులకు ఇతరులపై ప్రాధాన్యత ఇవ్వాలన్న షరీఅత్ ఆజ్ఞకు అతను కట్టుబడ్డాడు.

ఈ హదీసులో సౌశీల్యానికి, పవిత్రతకు గల ప్రాధాన్యత కూడా తేటతెల్లమయింది. పశ్చాత్తాపపడటం వల్ల పూర్వపు అపరాధాలు క్షమించబడతాయన్న విషయం కూడా దీనిద్వారా స్పష్ట మయింది. ఆహార ధాన్యాలకు బదులుగా కూలివాణ్ణి పెట్టు కోవటం సమ్మతమేనన్నది మరో అంశం. అమానతులను వాటికి యోగ్యులైన వారికి అప్పగించాలన్న ముఖ్యాంశం కూడా ఇందులో ఇమిడి ఉంది. సజ్జనులైన దాసుల ప్రార్థనా ఫలంగా అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కిస్తాడని ఈ హదీసు ద్వారా రుజువయింది.

హదీసులోని ముగ్గురు వ్యక్తులలో మూడవ వ్యక్తి మరింత మహత్తు కలవాడని ఖుస్తులానీ (రహ్మ) అంటారు. ఇమామ్ గజాలీ (రహ్మ) ఏమంటారంటే; లైంగికవాంఛ మనిషిపై తీవ్రంగా ప్రాబల్యం వహిస్తుంది. ఒక వ్యక్తి వద్ద సాధన సంపత్తి, అవకాశాలన్నీ ఉండి కూడా కేవలం దైవభీతి మూలంగా చెడు పని నుండి ఆగిపోయాడంటే, కచ్చితంగా అది సౌశీల్యానికి దర్పణం. అలాంటి వ్యక్తి స్వర్గవాసి అని దివ్య ఖుర్ఆన్ ద్వారా తెలుస్తోంది- 'తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుం దని భయపడి, తన మనస్సును దుష్టవాంఛలకు దూరంగా ఉంచిన వ్యక్తి యొక్క నివాసం స్వర్గమవుతుంది' (అన్ నాజిఆత్- 40)

126-1. పాలు త్రాగే పసికందు మాట్లాడటం ఒక అద్భుతం. దేవుని శక్తిసూచనలలో ఇదొకటి. దౌర్జన్యపరుడైన ఆ రౌతుతో ఆ పసివాడు తెగత్రెంపులను ప్రకటించాడు. కాని విశ్వసించిన ఒక బాధిత స్త్రీపై తన సానుభూతిని వెలిబుచ్చాడు. ఇందులో ఎన్నో గుణపాఠాలు అంతర్లీనమై ఉన్నాయి. దైవభీతిపరులకు, ధార్మికులకు ఇందులో మార్గదర్శకత్వం ఉంది. వారు ఎన్నడూ పదార్థ పూజారుల భోగభాగ్యాలను చూసి ప్రభావితులు కారాదు. పైగా అది వారికి దేవుడిచ్చిన గడువు అని తలపోయాలి. ఒకరోజు మరణం రానున్నది. అప్పుడు ఆట ముగుస్తుంది. ఇస్లాం ధర్మమే అతి పెద్ద సౌభాగ్యం. అది ఎన్నటికీ అరిగిపోనిది, తరగిపోనిది.




# 79 పరమోన్నత మిత్రుని వద్దకు

**- ఎస్.ఎమ్. మలిక్**

**అది** హిజ్రీ 10వ సంవత్సరం, రబీఉల్ అవ్వల్ 12వ తేదీ, ఫజ్ర్ (ప్రాతఃకాలం) నమాజ్ వేళ ఆయన(స) మహనీయ ఆయిషా(ర) గది తలుపు తెర తొలగించి చూశారు. మహనీయ అబూబక్ర్ నమాజ్ చేయిస్తూ ఉండగా వెళ్ళి ఆయన ప్రక్కన కూర్చొని నమాజ్ పూర్తి చేశారు, ఆ తరువాత ఇలా ప్రసంగించారు:

"జనులారా! మంట రగిలించడం జరిగింది, చీకటి రేయి ముక్కల్లా ఉపద్రవాలు ముసురుకున్నాయి, దైవం మీద ఒట్టు! మీరు నా మీద ఏదీ ఆరోపించలేరు; ఖుర్ఆన్ ధర్మ సమ్మతమయిందని నిర్ణయించని దేన్నీ నేను ధర్మసమ్మతం చేయలేదు; ఖుర్ఆన్ ధర్మసమ్మతం కానిదని నిషేధించని దేన్నీ నేను నిషేధించలేదు."

### అంతిమ క్షణాలు

ప్రసంగం ముగించి తిరిగి గదిలోకి వచ్చేశారు. మస్జిద్ నుంచి గదిలోకి రాగానే మహనీయ ఆయిషా ఒడిలో తలపెట్టి పరుండి నారు. అప్పుడు కొన్ని క్షణాల తరువాత మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబక్ర్(ర), గదిలోకి వచ్చారు. ఆయన(ర) చేతిలో పచ్చి పలుదోము పుల్ల (మిస్వాక్) ఉండగా ప్రవక్తశ్రీ(స) దాని వైపున శ్రద్ధగా చూశారు. మహనీయ ఆయిషా(ర) అది గమనించి, "ప్రవక్తా! మీరు మిస్వాక్ ఇవ్వమని కోరుతున్నారా?" అని అడిగి, ఆయన 'అవును' అనగా ఆ పలుదోము పుల్ల మహనీయ ఆయిషా(ర) తీసుకుని నమిలి బాగా మెత్తన చేసి ఆయన(స)కు ఇచ్చారు. ఆయన పుల్లను మామూలుగా బ్రష్ చేసినట్లే చేసి పెట్టేశారు.

ఆ పైన మహనీయ ఆయిషా(ర) ఉల్లేఖించారు : "నేను గమనించ సాగాను, క్రమంగా ఒడిలో ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) భారం పెరగసాగింది. నేను చూస్తూ ఉండగానే ఆయన కనుగ్రుడ్లు పైకెక్కసాగాయి. ఆయనకు అవసాన దశ ఆవహించిందని నేను గ్రహించాను. ఆయన పెదాలు కదులుతూ ఉండగా నేను శ్రద్ధగా విన్నాను, ఆయన(స) **"బలిర్రఫీకల్ఆలా మినల్ జన్నహ్"** (మరి స్వర్గంలోని పరమోన్నత మిత్రుల వద్దకు) అంటున్నారు. ❖

నేను గమనిస్తూ ఉండగానే ఆయన ఆత్మ దైవదూతలు వశపరచుకున్నారు. ఖైబరు కోట విజయం ప్రాప్తమయినప్పుడు ఒక యూదు మహిళ మేక మాంసంలో విషం కలిపి వేయించి ప్రవక్త, ఆయన సహచరులకు కానుకగా వడ్డించింది. ఆయన ఒక ముక్క నోట్లో వేసుకున్నారో లేదో ఆయన(స)కు దైవం తరఫున వహీ (దైవవాణి) ద్వారా ఆ విషయాన్ని తెలుపడం జరిగింది. ఆ ముక్కను ఆయన కక్కివేశారు. కాని అంతలోనే జరిగిన విష ప్రభావం వల్ల ఆయన చివరి దశలో, ఆరోగ్యం చెడటం, ఆయన(స) బాధలకు గురవడం జరిగింది.

చివరి రోజుల్లో ఒకసారి ఆయన మహనీయ ఆయిషా(ర)ను అడిగారు, "ఆయిషా! ఇంట్లో ఏమయినా డబ్బు ఉందా?" దానికి ఆమె కొన్ని దీనారులు తెచ్చి చూపారు. అప్పుడు ఆయన, "ముహమ్మద్, వీటిని తన ఇంట వదలి దైవాన్ని కలుసుకుంటే, అతను దైవాన్ని ఏ ఊహతో కలుసుకోనున్నట్లు? వీటిని దానం చేసివెయ్యి" అని పురమాయించారు. మహనీయ ఆయిషా(ర) ప్రకారం, ఆయన వద్ద ఉన్న ఒకే ఒక్క సొమ్ము, శిరోకవచం కూడా కొన్నాళ్ళ క్రితం పిండి కొనుగోలు కొరకు ఒక యూదుని వద్ద తాకట్టుగా పెట్టారాయన. దాన్ని విడిపించుకునే అవకాశం ప్రాప్తం కాలేదు!

వ్యాధిగ్రస్త దినాలలోనే ఓసారి ఇలా నుడివారు; "పరమ ప్రభువు యూదుల్నీ క్రైస్తవుల్నీ నాశపరచుగాక, వారు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా మార్చుకున్నారు". ఇంకా ఆయన, "అల్లాహ్! నా సమాధిని ఉత్సవ స్థలంగా, సంత కేంద్రంగా చెయ్యకు, జనుల్ని సంబోధించి, మీరు నా సమాధిని పండుగ స్థలిగా మార్చకండి" అని బోధించారు. మహనీయ ఆయిషా, "ఆయన సమాధిని ఆరాధనాలయంగా మార్చే భయం లేకపోతే సమాధిని కానవచ్చేలా కట్టేవారము" అని అన్నారు.

నేను ఆయన తల నిమ్మళంగా దిండు మీదికి దించి పెట్టేశాను. అది దాదాపు ఉదయం 9-30, 10:00 గంటల సమయం. మరో ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్తశ్రీ(స) స్వంత సేవకులు మహనీయ అనస్(ర) ప్రకారం అది ఆ దినం చివరి ఘడియ. తదనుగుణంగా అది దాదాపు సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల మధ్య సమయం కావచ్చు. ఆ తరువాత ఆమె బాధకు, ఆవేదనకు, దుఃఖానికి, రోదనకు అంతే లేదు. బాధతో ఆమె ఇతర మహిళల మాదిరిగానే నోరూ, రొమ్ము బాదుకుంటూ రోదించసాగారు. మరో ఉల్లేఖనం ప్రకారం చివరి క్షణాల్లో అత్యధికంగా ఉపదేశ వచనాలలో నమాజ్ పాటింపు, బానిసలు, నౌకరుల ఎడల సద్వర్తననే ప్రధానంగా పేర్కొన్నారని తెలుస్తోంది. ప్రముఖ సహచర మాన్యులందరూ అక్కడే ఉన్నారు. ప్రవక్తశ్రీ(స) పరమ పదించగానే మహనీయ ఉమర్(ర) అయితే ఆ బాధకు తట్టుకోలేకపోయారు. ఆయనకు మతిభ్రమించినంత పనయింది. ఆయన మస్జిద్‌లో నిలబడి, ప్రసంగించడం మొదలెట్టారు :

> "చాలామంది కపటులు, దైవ సందేశహరులు పరమ పదించారని అంటున్నారు. వాస్తవానికి, దైవం సాక్షి! ఆయన మరణించలేదు, ఆయన తన ప్రభువు వద్దకు వెళ్ళారు, మహనీయ మూసా(అ) నలభయి రోజులు తన జాతికి మరుగున ఉండిపోయినట్లు. కాని అప్పుడు కూడా జనులు ఆయన(అ) మరణించారని అన్నారు. నిజానికి ఆయన తరువాత తన జాతి ప్రజలలోకి వచ్చేశారు. దైవ సందేశహరులు ముహమ్మద్ సయితం అలాగే తిరిగి వచ్చేస్తారు, మహనీయ మూసా(అ) తిరిగి వచ్చినట్లే ఆయన వచ్చి దైవ ప్రవక్త మరణించారని అంటున్నవారి కాళ్ళూ చేతులు నరికివేస్తారు" అని ఏకధాటిగా ప్రసంగించసాగారు.

## సంయమనం

మహనీయ అబూ బక్ర్(ర) అంతకు కొన్ని నిముషాల ముందే ప్రవక్తశ్రీ(స) వద్ద సెలవు తీసుకుని ఇంటికి వెళ్ళారు. ప్రవక్త పరమ పదించిన సమాచారం అందగానే ఆయన(ర) వచ్చేశారు. ఆయన(ర) నేరుగా ప్రవక్త మహనీయుల గదిలోకి వెళ్ళారు. ప్రవక్తశ్రీ(స) పవిత్ర శరీరం గదిలో ఓ మూలన ఉంది. ఒంటిపైన యమనీ దుప్పటి కప్పి ఉంది. అబూబక్ర్(ర) ముందుకు అడుగు వేసి ఆయన పవిత్ర దేహం వద్దకు వెళ్ళి ముఖంపైని దుప్పటి తొలగించి నుదుటిని చుంబించారు. "మీ కొరకు నా తల్లిదండ్రుల్ని త్యాగం చేద్దును, ప్రవక్తా! దైవం మీ కొరకు నిర్ధారించిన మృత్యువయితే వచ్చేసింది. ఇక దీని తరువాత మీకు (స) మృత్యుబాధ ఎన్నడూ సోకదు" అంటూ చెమర్చిన కళ్ళతో దుప్పటిని యథాతథంగా సర్ది ముఖం కప్పి అక్కడినుండి నిష్క్రమించారు.

అబూబక్ర్(ర) బయటికి రాగానే గమనించారు, ఉమర్(ర) తన ప్రసంగాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. అబూబక్ర్(ర) ఆయన్ని పట్టుకుని, "ఉమర్, సంయమనం పాటించు, నిమ్మళించు, ఓరిమి వహించు, మౌనం పాటించు" అని బోధించారు. కాని మహనీయ ఉమర్(ర) ఇదేమీ పట్టించుకునే స్థితిలో లేరు. తన ప్రసంగాన్ని సాగిస్తూనే ఉన్నారు. ఇక మహనీయ అబూబక్ర్(ర)

❖ స్వర్గంలోని మిత్రులంటే గతించిన దైవప్రవక్తలని పండితులు, వ్యాఖ్యాతలు, హదీసువేత్తలు తెలిపారు.

ఈయనకు చెప్పి లాభం లేదని, జనులకు బోధపరచవలసి ఉందని గ్రహించారు. అయన(ర) దైవస్తోత్రం తరువాత నిలకడగా చెప్పసాగారు.

"జనులారా! ఎవరయితే ముహమ్మద్(స)ని ఆరాధించే వారో, పూజించేవారో వారు బాగా వినండి, అర్థం చేసు కోండి, మహనీయ ముహమ్మద్(స) అయితే పరమ పదించారు. మరెవరయితే దైవాన్ని ఆరాధించేవారో వారు తెలుసుకోవాలి, అల్లాహ్ అయితే సజీవంగా ఉన్నాడు, ఆయన నిత్య సజీవుడు, ఆయనకు మృత్యువు సోకదు, అజరామరుడు" అని గంభీరంగా నుడివారు ఆపైన ఈ దివ్య వచనం పఠించారు :

"ముహమ్మద్(స) ఒక దైవ సందేశహరులు తప్ప మరేమీ కారు. ఈయనకు పూర్వం కూడా అనేకమంది దైవ సందేశహరులు గతించారు. అలాంటప్పుడు ఆయన పరమ పదించినా లేదా సంహరించబడినా మీరు మీ మడిమల మీద వెనక్కి మరలిపోతారా? బాగా గుర్తుంచుకోండి! ఎవరయితే వెనక్కి మరలిపోతారో వారు అల్లాహ్‌కు ఎటు వంటి నష్టం చేకూర్చలేరు. కాని ఎవరయితే అల్లాహ్ పట్ల కృతజ్ఞతాపూర్వకమయిన దాసులవుతారో వారికి ఆయన (దైవం) దానికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు" (ఆలి ఇమ్రాన్ 3: 144)

మహనీయ అబూ హురైరా(ర) (హదీసుల ఉల్లేఖనకర్త) ప్రకారం, "దైవంసాక్షి! ఈ ఆయత్(వచనం) ఎప్పుడో అవతరించిందన్న విషయం జనాలకు గుర్తే లేదు. మహనీయ అబూబక్ర్(ర) పారాయణం తరువాతనే అది జనులకు గుర్తుకు వచ్చింది అబూబక్ర్(ర) ద్వారా విని ఆ ఆయత్ (వచనం)ను కంఠస్థం చేసుకున్నారు.

మహనీయ అబూ హురైరా(ర) ఆ తరువాత ఇలా కూడా ఉల్లేఖించారు: "అప్పుడు మహనీయ ఉమర్(ర) కూడా అన్నారు, "దైవం మీద ఒట్టు! ఈ ఆయత్‌ను నేను అబూబక్ర్ పారాయణం చేయగానే విన్నట్లు అనుభూతి చెందాను, (అంటే అది అప్పుడే అవతరించిన అనుభూతి నాకు కలిగింది). అది విన్న తరువాత నాపైన ఎంతో తీవ్రమయిన భయం, ఆవేదన ఆవహించాయి. నా కాళ్ళు నేలపై ఆనలేక పోతున్నాయి. అప్పుడు గాని నాకు స్పృహ కలగలేదు, అప్పుడే నేను గ్రహించగలిగాను, వాస్తవంగానే ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) పరమపదించారని."

అప్పుడు మహనీయ ఉమర్(ర) మాత్రమే కాదు, అక్కడున్న వారంతా ప్రవక్తశ్రీ(స) ఇకలేరు అన్న స్పృహ కలగగానే తల్లడిల్లి పోయారు. ధారాపాతంగా అందరి కళ్ళ నుండి అశ్రువులు రాలసాగాయి. రోదనలూ వినిపించసాగాయి.

### పరమపదించిన తేది

విభిన్న ఉల్లేఖనాల విశ్లేషణ తరువాత సర్వాంగీకృతంగా నిర్ధారిత మయిన తేదీ సోమవారం, రబీఉల్ అవ్వల్ నెల 12వ తేదీ. అయితే ఆ తేదీన లేదా జన్మ తేదీన (అది కూడా 12, రబీఉల్ అవ్వల్ అన్నది నిర్ధారితం). ప్రవక్త అనుయాయుల్లో, సహచర మాన్యుల్లో, అనుచర పండితులు, ప్రముఖుల్లో శతాబ్దుల తరబడి ఎటువంటి స్మారక దినం, కార్యక్రమం, ఉత్సవం, ఎటువంటి సభ, సమావేశం జరిపే సంప్రదాయం లేదు ఆయన పరమ పదించినప్పటికి ఆయన వయసు 63 సంవత్సరాలు మాత్రమే.


***ఆధారం :*** *1) సీరతున్నబీ కామిల్, ఇబ్నుహిష్షామ్ : సం.2, పు.787-805*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3, పు.429-433*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.10, పు.329-371*


❖


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**




- తాహిరా తస్వీర్



**ఈ వ్యాసం గీటురాయి మాసపత్రిక మే ,1992లో ప్రచురించబడింది. గీటురాయి పాత సంచికల్లో ఇలాంటి అద్భుత పరిమళాలు ఎన్నో... ఎన్నెన్నో...**

# ఆడపిల్లలే 'రేపటి' అండ

**ఎంత మంచి** తల్లిదండ్రులయినా ఆడపిల్లలకన్నా మగ పిల్లలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం అందరికీ తెలిసిందే. సంఖ్యాపరంగా కూడా ఆడపిల్లలకంటే మగ పిల్లలనే ఎక్కువగా కోరుకుంటారు తల్లిదండ్రులు. కేవలం ముగ్గురు పిల్లలుంటే చాలనుకునే నవ నాగరికతా ప్రియులైన తల్లిదండ్రులు సయితం ఆ ముగ్గురిలో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉండాలని కోరుకుంటారు.

ఇలా స్త్రీ సంతానంపై తల్లిదండ్రులకు ఇంత తక్కువ చూపు ఎందుకు? మగపిల్లలు పెద్దవారయిన తరువాత సంపాదించి పెడ్తారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తారు. అదే ఆడపిల్లలయితే వారిని పెంచి పోషించడానికే ఆస్తి హరించి పోతుంది. చివరికి ఆ ఆడపిల్లను ఒక అయ్య చేతిలో పెట్టవలసి వస్తుంది. పైగా ఈ రోజుల్లోనయితే ఆమెను పెద్ద ఎత్తున కట్న కానుకలిచ్చి మరీ అత్తవారింటికి సాగనంపవలసి వస్తుంది. ఈ కారణంగానే అనాది నుండి సమాజంలో ఆడపిల్లలను అల్ప దృష్టితో చూడటం జరుగుతూ వస్తోంది.

ఈ కారణంతోపాటు ఇస్లాంకు పూర్వం అరేబియాలో ఆడపిల్లలను అల్ప దృష్టితో చూడటానికి మరో కారణం కూడా ఉంది. ఆనాడు అరబ్బులు కూతుర్నిచ్చి అల్లుడ్ని చేసుకోవడం తమకు అవమాన కరమైన విషయంగా భావించేవారు. ఒక వ్యక్తికి మామ కావడం కంటే మించిన అవమానం లేదు ఆ రోజుల్లో.

ఈ రెండు కారణాల వల్ల ఆనాటి అరబ్బులు ఆడ సంతానాన్ని తక్కువ చూపుతో చూసేవారు. వారి ఆలనా పాలనా గురించి పట్టించుకునేవారు కాదు. అంతేకాదు, వారి జీవించే హక్కును కూడా గుర్తించడానికి సిద్ధమయ్యేవారు కాదు. తత్పర్యవసానంగా ఆ పాషాణ హృదయులు తమ ఆడపిల్లలను పిన్న వయసులోనే గొంతు నులిమి చంపేవారు; లేదా గుంటతీసి అందులో సజీవంగా పాతిపెట్టేవారు. ఈ విషయాన్ని దివ్య ఖుర్ఆన్ ఈ క్రింది విధంగా వర్ణిస్తోంది.

"వారిలో ఎవరికైనా కూతురు పుట్టిందని సమాచారం అందజేస్తే. అతడు (అవమాన భారంతో)ముఖాన్ని నల్లగా మాడ్చుకొని లోలోన కుమిలిపోతాడు. ఇక ప్రజలకు ఎలా ముఖం చూపాలి? అని తలచి, వారికి కనపడకుండా ముఖం చాటు చేసుకుని తిరుగు తుంటాడు. ఈ అవమానాన్ని భరిస్తూ కూతుర్ని అట్టి పెట్టుకోవాలా లేక నేలలో పాతి పెట్టాలా? అని ఆలోచిస్తాడు."

(దివ్య ఖుర్ఆన్ 16: 58,59)

ఈ విషయంలో ఒక సహాబి ఇస్లాం స్వీకరించడానికి పూర్వం తన కుమార్తెలను ఎలా సజీవ సమాధి గావించారో ఆ హృదయ విదారక వృత్తాంతాన్ని తెలుసుకుందాం :

మహాప్రవక్త(సఅసమ్) ఓ రోజు కొందరు అనుచరులతో సమావేశమయి ఉండగా హజ్రత్ ఖైస్ బిన్ ఆసిమ్(రజి) ఆయన సన్నిధికి వచ్చారు. మాటల సందర్భంలో ఒక అన్సారి ముస్లిం ఆడపిల్లలను సజీవ సమాధి చేసే విషయాన్ని ప్రస్తావించారు. అప్పుడు హజ్రత్ ఖైస్ బిన్ ఆసిమ్(రజి) స్పందిస్తూ "నిజంగా నేను నా కుమార్తెలనందరినీ అవమాన భయంతో నేలలో పాతిపెట్టాను" అని చెప్పారు.

"దానిపై ఎప్పుడైనా నీకు జాలి అంటూ కలగలేదా?" అని దైవప్రవక్త (సఅసమ్) అడిగారు.

అప్పుడు ఆ సహాబీ ఇలా అన్నారు : "నాకు ఏనాడూ ఎవరిపైనా జాలి కలగలేదు. అయితే ఓసారి ఇలా జరిగింది- నేను పరదేశం వెళ్ళి ఉన్నాను. ఆ రోజుల్లో ఇంట్లో నాకు ఓ కూతురు పుట్టింది. ఆ పాప ఎంతో అందమైనది. పాప తల్లి (అంటే నా భార్య) ఆమె ప్రాణాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆమెను తన సోదరికి అప్పగించింది.

"నేను ప్రయాణం నుండి తిరిగి వచ్చిన తరువాత ఇంటి పరిస్థితులు అడిగాను. నా భార్య పరిస్థితులు వివరిస్తూ 'ఒక ఆడపిల్ల పుట్టింది. దాన్ని భూమిలో పాతి పెట్టాము' అని చెప్పింది. ఈ మాట విని నేను మౌనంగా ఉండిపోయాను. ఆ పాప క్రమంగా పెరిగి కొంత కాలానికి పెద్దదయిపోయింది. ఓ రోజు ఆమె తన తల్లిని చూడటానికి వచ్చింది. సరిగ్గా అదే సమయంలో నేను ఇంటికి తిరిగొచ్చాను. ఆమె తల్లి ఆమెకు తలదువ్వి, జడ వేసి, బట్టలు తొడిగించింది. అప్పుడా పాప ముఖంలోని అమాయకత్వం, అందచందాలు నన్ను ఎంతో ముగ్ధుడ్ని చేశాయి. నేను 'ఈ పాప ఎవరి కూతుర'ని అడిగాను.

ఈ మాట విని ఆమె తల్లి ఏడ్వడం మొదలుపెట్టింది. 'ఈ పిల్ల మీ కూతురేనండి!' అంటూ జరిగిన విషయం పూర్తిగా వినిపించింది. నేనీ వృత్తాంతం విని మిన్నకుండిపోయాను. మరేమాటా ప్రస్తావించలేదు. చివరికి ఆమె తల్లి ఆ విషయాన్నే మరచిపోయింది.

"నేను అవకాశం చూసి ఓరోజు పాపను బయటికి పిలుచుకెళ్ళాను. (నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్ళి) ఓ గుంట త్రవ్వటం ప్రారంభించాను. అప్పుడు మట్టి ఎగిరెగిరి వచ్చి నా శిరోజాలపై పడుతుంటే, ఆ పాప తన చిన్నారి చేతులతో నా తల తుడుస్తుండేది. నాకు అప్పుడూ ఆ అమ్మాయిపై జాలి వేయలేదు. (గుంట తవ్వడం పూర్తయ్యాక) నేనామెను గుంటలోకి తోశాను. పైనుండి గుంటలోకి మట్టి వేస్తుంటే, ఆ పాప కేకలు పెడ్తూ 'నాన్నా! నా మీద ఈ మట్టి వేసి కప్పివేస్తావా? నన్నిక్కడ ఒంటరిదాన్నిగా వదిలేసి వెళతావా నాన్నా!?' అని అంటుండేది. నేను ఆ గుంటను పూర్తిగా పూడ్చి భూమట్టానికి చేసేవరకు ఆమె అలా అంటూ విలపిస్తూనే ఉండింది. చివరికి ఆమె కంఠధ్వని ఆగిపోయింది- ఈ చర్య పట్ల ఆ తరువాత నేనెంతో పశ్చాత్తాపం చెందాను. అది ఇప్పటికీ నా హృదయాన్ని పట్టి పీడిస్తోంది."

విశ్వ కారుణ్యమూర్తి (స) ఈ ఉదంతం విని కంట తడిపెట్టారు. "నిజంగా ఇది ఎంతో నిర్దాక్షిణ్యమైన చర్య. ఏ ఒక్కరిపై జాలి చూపని వ్యక్తిని ఎవరూ కనికరించరు" అని అన్నారు ఆయన.

ఇదీ ఆనాటి అరబ్ సమాజంలో ఆడపిల్లల పట్ల ప్రజల క్రూరమైన ప్రవర్తన! ఈనాడు కూడా మన దేశంతోపాటు కొన్ని దేశాలలో ఆడపిల్లలను తల్లిదండ్రులు అల్ప దృష్టితో చూస్తున్నారు. అంతే కాకుండా అనేకమంది లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా పుట్టబోయే బిడ్డ ఆడపిల్లని తెలిస్తే ఆ పిండాన్ని మాతృ గర్భంలోనే హతమారుస్తున్నారు.

వీటన్నింటికీ ప్రధాన కారణం ఆర్థిక లేమికి గురవుతామన్న భయమే. కాని అసలు ఉపాధి ప్రదాత దేవుడేనని దివ్య ఖుర్ఆన్ నొక్కి చెబుతోంది :

"మీరు లేమికి గురవుతారన్న భయంతో మీ సంతానాన్ని హతమార్చకండి. వారికి ఆహారాన్నిచ్చే వారము మేమే. మీకూ ఆహారాన్నిచ్చేవారము మేమే. వారిని హతమార్చడం ఘోర పాపం." (17: 31)

ఈ ఘోర పాతకానికి పాల్పడేవారు తీవ్ర నష్టానికి గురవుతారని కూడా ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది :

"ఎవరైతే అజ్ఞానంతో అనాలోచితంగా తమ సంతానాన్ని హతమార్చారో వారు నిస్సందేహంగా ఎంతో నష్టంలో పడిపోయారు." (6: 140)

"సూర్యుడు చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరిపోయినప్పుడు... సజీవంగా పాతిపెట్టబడిన బాలికను 'నీవు ఏ తప్పు వల్ల హతమార్చబడ్డావ'ని అడిగినప్పుడు... ప్రతి మనిషికీ తెలిసిపోతుంది తానేమి తీసుకువచ్చాడో." (81: 1-14)

స్త్రీ జాతికి జరుగుతున్న ఈ అన్యాయాన్ని అంతమొందించటానికి

మహాప్రవక్త ముహమ్మద్(స) ఈనాటి స్త్రీ విమోచనా ఉద్యమాల్లా ఎలాంటి ప్రత్యేక ఉద్యమాన్ని లేవదీయలేదు. ఆయన ప్రజల్లో పరలోక భీతిని కలిగిస్తూ స్త్రీ కూడా పురుషునిలాగే దేవుని సృష్టిరాసి అని, ఆమెకు కూడా పురుషుని మాదిరిగానే సమాన హక్కులు ఉన్నాయని లోకానికి ఎలుగెత్తి చాటి చెప్పారు.

బాలికల సంరక్షణపై ఇస్లాం ప్రత్యేక దృష్టి సారించింది. బాలికలను ఉత్తమ రీతిలో పెంచి పోషించిన వారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని తెలిపింది. వివిధ సందర్భాలలో మహాప్రవక్త (సఅసం) ఇలా బోధించారు :

“ఎవరికైతే ఆడపిల్ల పుడ్తుందో, అతనామెకు ఎలాంటి బాధలు పెట్టకుండా; అవమానం, అనాదరణలకు గురిచేయకుండా, ప్రేమ, ప్రవర్తనల విషయంలో ఆమెకన్నా మగపిల్లలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వకుండా (వారితోపాటు ఆమెను సమానంగా చూసుకుంటూ) మసలుకుంటాడో, అలాంటి వ్యక్తికి ఆడపిల్ల పట్ల మంచిగా ప్రవర్తించినందుకు ప్రతిఫలంగా దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు.” (మస్నద్ అహ్మద్)

“ఏ దాసుడు లేక దాసిపై దేవుడు కుమార్తెల (సంరక్షణా) బాధ్యతను మోసినప్పుడు, అతను లేక ఆమె ఆ కుమార్తెల పట్ల మంచిగా ప్రవర్తించి ఉంటారో, ఆ ఆడపిల్లలు అతడ్ని లేక ఆమెను నరకం నుండి కాపాడే సాధనాలుగా మారుతారు.” (బుఖారి, ముస్లిం)

“ఏ దాసుడయితే ఇద్దరు ఆడపిల్లల (సంరక్షణా) బాధ్యతను వహిస్తూ, వారిని యుక్త వయస్సు వచ్చేవరకు (సరిగా) పోషిస్తాడో, ప్రళయదినాన అతను, నేను ఈ విధంగా (పరస్పరం) వెంట ఉంటాము అని దైవప్రవక్త(స) అన్నారు. హజ్రత్ అనస్(రజి) ఈ హదీసును ఉల్లేఖిస్తూ దైవప్రవక్త(స) తన చేతి (రెండు) వేళ్ళను పూర్తిగా కలిపి చూపించారని అన్నారు.” (ముస్లిం)

వేరొక హదీసులో విశ్వకారుణ్యమూర్తి (స) ఇలా ప్రవచించారు: “ఏ దాసుడయితే ముగ్గురు కుమార్తెల లేక ముగ్గురు సోదరీలు లేదా ఇద్దరు కుమార్తెలు లేక ఇద్దరు సోదరీల (సంరక్షణా) బాధ్యతను వహించి, వారికి సరయిన శిక్షణ గరిపి, వారి పట్ల మంచిగా ప్రవర్తించి, ఆపై వారికి పెళ్ళిళ్ళు చేస్తాడో- అలాంటి వ్యక్తికి దేవుని తరఫున స్వర్గం (లభిస్తుందన్న) నిర్ణయమవుతుంది.” (అబూదావూద్, తిర్మిజీ)

పై హదీసుల ద్వారా మూడు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఒకటి, వారితో సత్ప్రవర్తన ఆడపిల్లల హక్కు. రెండు, ఆడపిల్లల పట్ల మంచిగా ప్రవర్తించిన వ్యక్తి ప్రళయదినాన దైవ సందేశ హరుని (స)కి అతి చేరువలో ఉంటాడు. మూడు, అతనికి నరకం నుంచి విముక్తి కలుగుతుందని, స్వర్గ ప్రవేశం లభిస్తుందని వాగ్దానం చేయబడింది.

దైవ సందేశహరుని సతీమణి హజ్రత్ ఆయిషా(రజి) ఇలా వివరిస్తున్నారు :

“ఒకరోజు ఓ (పేద) స్త్రీ ఇద్దరు బాలికలను వెంటబెట్టుకుని నా వద్దకు యాచించడానికి వచ్చింది. అప్పుడు నా వద్ద ఒక ఖర్జూరం తప్ప మరేమీ లేదు. ఆ ఖర్జూరాన్నే నేనామె చేతిలో పెట్టాను. ఆమె దాన్ని తన ఇద్దరు కూతుళ్ళకు చెరిసగం పంచిపెట్టి, తను మాత్రం దాన్ని కాస్తయినా రుచి చూడలేదు. ఆ తరువాత ఆమె వెళ్ళిపోయింది- ఆమె వెళ్ళిపోయాక దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ఇంటికి వచ్చారు. నేనాయనకు ఈ సంఘటన వినిపించాను. అప్పుడాయన ఈ విధంగా ప్రవచించారు :

“ఆడపిల్లల (సంరక్షణా బాధ్యత) ద్వారా పరీక్షకు గురిచేయబడిన ఏ వ్యక్తి అయినా సరే వారి పట్ల మంచిగా ప్రవర్తిస్తే అతని కొరకు ఈ బాలికలు నరకానికి అడ్డు (గోడ)గా తయారవుతారు.” (ముత్తఫఖున్ అలైహి) ❖


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# జర జాగ్రత్తా! పాప కర్మలు రికార్డ్ అవుతున్నాయి...

- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల

**ప్రపంచ** మానవులు తమ జీవితమే ముఖ్యం, తాము అనుకున్నట్లే జీవిస్తాం అనే తరహాలో బ్రతికేస్తున్నారు. సాటి మానవుడు తన వల్ల ఎంత కష్టపడిన, ఎంత నష్టపోయిన ఆలోచించే దశలో లేడు. ఎవరి భయమూ లేదు, సమాధానం చెప్పుకోవాల్సిన ధ్యాస లేదు, దైవ భీతి లేదు. అయితే విశ్వాసులు కూడా పాప కర్మలు తెలిసి తెలియక కూడా చేస్తుంటారు. తమను ఎవరూ చూడటం లేదనుకున్నవారికి నేటి సీసీ కెమెరాల కన్న ఎన్నో రెట్లు అధికమైన దైవ కెమేరాలు పని చేస్తున్నాయి అన్న భయంతో తమకు తాము నియంత్రించుకుంటారో అలా దైవ భీతితో తమ తప్పటడుగులు సవరించుకుంటారో వాళ్ళు ఇహపరాల్లో పాపాలకు దూరం అవుతారు.

ప్రతి వ్యక్తి చేసే మంచి చెడుల గురించి కుడి ఎడమల దైవం నియుక్తులు చేసిన దైవదూతలు కిరామన్ కాతిబీన్ (లేఖకులు) అన్ని యధావిధిగా రికార్డు చేస్తుంటారు. రాత్రి పగలు, చీకటి వెలుగులో ప్రతి క్షణం మన కర్మలు ఆ దైవ దూతలు నిరంతరం కార్యరూఢులై తమ బాధ్యత నిర్వర్తిస్తూ దైవ ఆజ్ఞా పాలనలో లీనమై లిఖిస్తు ఉంటారు. వ్యక్తిగతంగా బాహాటంగా మనం చేసిన కార్యాలు తీర్పుదినం నాడు మన కర్మలుగా యధావిధిగా ప్రదర్శించబడుతాయి. తస్మాత్ జాగ్రత్తా! ఈ పనులు ఏ రూపంలో చేసిన తీక్షణమైన అల్లాహ్ చూపు నుండి తప్పించు కోవడం అసాధ్యం.

"మీరు శిక్షా ప్రతిఫలాలు లేవని తిరస్కరిస్తున్నారు. కాని మీ పై కాపలదారులు నిర్మించబడి ఉన్నారు. మీ చర్యలను ఒక కంట కనిపెడుతూ ఉండే గౌరవనీయులైన లేఖకులు మీ పై నియమింప బడ్డారు. మీరు చేసే పని వారికి తెలుసు." (దివ్య ఖుర్ఆన్, 82:10-12)

ప్రపంచంలో ఏ ప్రదేశంలో అయిన, ఏ భూమి, పర్వతాలు, సముద్రాలు భవంతులు అయిన మనం చేసే పనులకు సాక్ష్యంగా నిలుస్తాయి. దైవాజ్ఞా అయినప్పుడు తమపై మానవుడు చేసిన పాప కర్మలు చిట్టా పూర్తి సాక్ష్యాలతో 'లైవ్' ప్రదర్శన ఇస్తాయి. మనం బొంకిన, లేదని తప్పించుకొని అవకాశం లేని బలమైన ఆధారాలు ఈ భౌగోళిక స్వరూపాలు నిక్షిప్తం చేసి ఉంటాయి.

"భూమి తన పూర్తి తీవ్రతతో ఊపి వేయబడినప్పుడు, భూమి తన లోపల ఉన్న మొత్తం భారాన్ని తీసి బయట వేసినప్పుడు మానవుడు, "దీనికేమయింది (ఇలా ఊగిపోతుంది)" అని అంటాడు. ఆరోజున అది తన (పైన సంభవించిన) విశేషాలు వివరిస్తుంది. ఎందుకంటే నీ ప్రభువు దాన్ని (అలా చేయమని) ఆజ్ఞాపించాడు." (దివ్య ఖుర్ఆన్, జిల్ జిల్ 99:1-4)

తీర్పు దినం నాడు కర్మ ఫలాల రిపోర్టు (నామె ఆమాల్ నామా) మన చేతులకు అందివ్వబడుతుంది. మనం ఎవ్వరు చూడలేదు అన్న భావనకు కూడా చోటు లేకుండా స్క్రీన్ మన ముందు వచ్చేస్తుంది. అప్పుడు విలపించిన, రోదించిన లాభముండదు. మన చేతులు, కాళ్ళు తాము చేసిన, మనం చేయించిన పనులు చెప్పడం మొదలు పెడతాయి. మనకు వ్యతిరేకం అనుకున్న అవి చేసిన వాస్తవాలు దైవాజ్ఞాతో బయట పెడతాయి.

"ఈ నాడు మేము వారి నోళ్ళు మూయిస్తాం. వారు ప్రపంచంలో ఏమేమో సంపాదిస్తూ ఉండే వారి వారి చేతులు, వారి కాళ్ళు సాక్ష్యమిస్తాయి." (దివ్య ఖుర్ఆన్, యాసిన్ 36:65)

అన్నిటి మించి సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ విశ్వ దృష్టి నుండి ఎవరు తప్పించుకో జాలరు. రాత్రి చీకటిలో నల్లరాతి పై నడిచే నల్లటి చిరు చీమను చూడగల దాని నడక శబ్దాన్ని విన గల శక్తి ప్రదాత అల్లాహ్. "ఇన్నల్లాహ సమీఉన్ బషీర్", ప్రతి క్షణం దైవం తనను గమనిస్తూ ఉన్నాడు అన్న భావన మనలో అంతర్లీనంగా ఉద్దీపనం అవుతుండటమే దైవ భీతి (తఖ్వా). ఈ భావన మన ఆరాధనలు, ఆచారాలు ఉన్నత ప్రమాణాలతో నడుస్తున్నాయన్న తృప్తి కలిగిస్తాయి, పాప కర్మలకు దూరంగా ఉంచుతాయి. ఇస్లాం పరిధిలో నడిచేవారు ఈ దశ యాంత్రికతలో ఇమిడి ఉత్తమ నడవడికలో మంచి సమాజ స్థాపనలో లీనం అవుతూ ఉంటారు.

"భూమ్యాకాశాలలో ఉన్న రహస్య విషయాలన్నీ అల్లాహ్ కు బాగా తెలుసు (అన్ని సంగతి మీరు గ్రహించాలి) మీరు చేసేదంతా ఆయన చూస్తూనే ఉన్నాడు" (దివ్య ఖుర్ఆన్, 49:18)

పై నాలుగు విషయాల నుంచి మన పాప కర్మలు దాగలేవని తలచి పాపకార్యాలకు దూరంగా ఉండి ఇహపరాల్లో పుణ్యప్రాప్తం పొందుదాం.

# సత్సమాజ నిర్మాణం కోసం

- నసీరా బేగం

**ఇస్లామ్** సంఘటితతత్వపు జీవితాన్ని ఇష్టపడే ధర్మం. విశ్వాసులందరూ కలిసిమెలిసి ఐక్యతా భావంతో జీవించాలని బోధిస్తుంది. దాని అర్థం బహిరంగంగా కలసిమెలసి ఉండడం అని కాదు. ఒకరి హృదయాలు మరొకరితో కలసిపోయి ఉండాలని. ఇస్లామ్ ఐక్యత పునాది విశ్వాసం, త్యాగాలపై ఆధారపడి ఉండాలని ఉపదేశిస్తుంది. సమాజంలో పరస్పర సంబంధాలు సజీవంగా, సంతోషంగా ఉండాలంటే దానికి కొన్ని హద్దులు, పద్ధతులు తప్పకుండా ఉండాలని తెలియజేస్తుంది.

మానవుల్లో, జంతువుల్లో చాలా తేడా ఉంటుంది. మానవునికి దేవుడు బుద్ధిజ్ఞానాన్ని ప్రసాదించాడు. జంతువులకు వీటిని ప్రసాదించలేదు. మనిషికి సమాజంతో సంబంధం ఉంటుంది. సమాజం లేకుండా మనిషి లేడు. మనిషి లేకుండా సమాజం లేదు. ఇస్లామ్‌లో మనిషి స్థానాన్ని విశదంగా తెలియజేయబడింది. అతను అల్లాహ్ దాసుడు, ఆయన ప్రతినిధి అని ఈ విషయాన్ని ఆయన దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేశాడు : నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు. (51: 56)

ఇస్లామ్ బోధనలలో ఆరాధన మనిషి ముఖ్యమైన ఆచరణ. ఈ ఆచరణా మైదానం అతని చుట్టూ ఉండే సమాజం. కాని ఈ ఆధునిక సమాజం ధర్మాన్ని అభివృద్ధిలో ఆటంకంగా భావిస్తోంది. దాని కారణంగా మనిషిలో ఆశ అధికమైపోయింది. స్వార్థం పెరిగిపోయింది. కాని ఇస్లామ్ ధర్మం దానికి భిన్నంగా అల్లాహ్ ప్రసన్నత కోసం సత్కార్యాలు చెయ్యాలని ఉపదేశిస్తోంది. సత్కార్యం అంటే అసలు ఏమిటో దివ్యఖుర్‌ఆన్‌లో సెలవీయటం జరిగింది. సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, దూతలనూ అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకు, నిరుపేదల కొరకు, బాటసారుల కొరకు, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకు, బాటసారుల కొరకు, ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్టకాలంలో లేమిలో సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు. అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే. (2: 177)

ఇస్లామీ సమాజం ముఖ్యమైన బోధనలు విశ్వాసం, ఆచరణలు, కార్యకలాపాలకు సంబంధించినవి ఉంటాయి. వీటిలో ఏ విషయం పట్ల అశ్రద్ధ వహించినా సమాజం ప్రభావితమవుతుంది. మనిషి పరలోక జీవితమూ నష్టానికి గురవుతుంది. అల్లాహ్, భక్తుని సంబంధం సమాజంతో మనిషికి ఉన్న సంబంధంపై ఆధారపడి ఉంటుంది. సమాజం అభివృద్ధి అల్లాహ్‌ను విశ్వసించటం, మానవులను గౌరవించటంపై ఆధారపడి ఉంది.

ఇస్లామ్ దృష్టిలో మానవులందరూ సమానులే. ఒకే తల్లికి, ఒకే తండ్రికి చెందిన సంతానం. కులం, జాతి, వర్గం, వర్ణం, రంగు రూపు ఆధారంగా విభజించటం అనేది ఎంతమాత్రమూ లేదు. ఈ విషయాన్ని దైవప్రవక్త(స) మదీనా పట్టణంలో ఇస్లామీ

ప్రభుత్వాన్ని స్థాపించి కార్యరూపంగా ప్రజలకు చూపించారు. ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ప్రజలందరూ రెండువర్గాలలోనే విభజించబడతారు 1) అల్లాహ్ దృష్టిలో మహోన్నతులైన సజ్జనులు 2) అల్లాహ్ దృష్టిలో నీచులైన దుర్మార్గులు. ఇంకా అందరూ ఆదమ్(అ) సంతానమే. ఆదమ్ మట్టితో సృష్టించ బడ్డారు. ప్రజలు తమ పూర్వీకులపై గర్వపడటం అనేది మానుకోవాలి. కాకపోతే వారు అల్లాహ్ దృష్టిలో ఒక అల్పమైన కీటకం కంటే కూడా నీచులైపోతారు.

దీనిద్వారా బోధించబడిన విషయమేమిటంటే మానవులందరూ అన్నాతమ్ముళ్ళు, అక్కాచెలెళ్ల మాదిరిగా కలిసిమెలిసి తోడు నీడగా జీవించాలి. లేకపోయినట్లయితే సమాజం ఛిన్నాభిన్నమైపోతుంది అని.

మానవులందరూ ఒక్కటే అయినప్పుడు వారి ప్రభువు కూడా ఒక్కడే. ఆయన సకల లోకాలకు ప్రభువు. సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, ప్రభువు, యజమాని. సకల స్తోత్రాలు ఆయనకే. సకల ఆరాధనలు ఆయన కోసమే. సకల శక్తులు ఆయన అధీనంలోనే. ఈ విషయాన్ని ఆయనే దివ్యఖుర్ఆన్‌లో ఇలా తెలియజేశాడు : మీ నిజమైన ఆరాధ్య దైవం కేవలం అల్లాహ్ ఒక్కడే. ఆయన భూమికీ, ఆకాశాలకూ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికి ప్రభువు. (37: 4,5)

ఇంకా మానవుని గురించి ఆయన ఇలా తెలియజేశాడు : మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. ఇదంతా మా అనుగ్రహం. (17: 70)

ఇస్లామ్ ధర్మం ప్రేమా, కారుణ్యాలతో కూడిన ఒక చక్కటి సమాజాన్ని నిర్మించాలని భావిస్తుంది. దానికోసం ఆ సమాజంలోని ప్రజలు నైతిక విలువలతో కూడినవారై, మంచి ప్రవర్తన కలవారై ఉండాలని కోరుతుంది. దానికి మొట్టమొదట చిత్తశుద్ధితో కూడిన హృదయం కావాలని, ఇతరుల పట్ల ఎలాంటి ద్వేష విద్వేషాలు ఉండకూడదని, తన కోసం ఏదైతే ఇష్టపడతారో ఇతరుల కోసం కూడా ఇష్టపడాలని బోధిస్తుంది. సాధారణంగా మనిషి తన కోసమే మంచిని, శాంతిని కోరుకుంటాడు. ఒకవేళ ఇదే కోరిక ఇతరుల కోసం కూడా అతని హృదయంలో ఉన్నట్లయితే ప్రతి ఒక్కరి హృదయంలో ఇదే కోరిక ఉన్నట్లయితే ఆ సమాజం ఎంతటి సుందర సమాజంగా రూపుదిద్దుకుంటుందో ఆలోచిస్తే అర్థమవుతుంది.

రెండోది, త్యాగం. ఒక విశ్వాసిలో ఉండవలసిన ముఖ్యమైన సుగుణం. ఈ సుగుణం మనిషిని తన తోటి సోదరుని గురించి ఆలోచించేలా చేస్తుంది. అతనికి తనపై ప్రాముఖ్యత ఇచ్చేలా చేస్తుంది. అతని అవసరాలను తీర్చేలా చేస్తుంది. అంతేకాదు, అతని సుఖపెట్టాలని కూడా ప్రయత్నిస్తుంది. దైవప్రవక్త(స) గారి జీవితంలో ఆయన(స) గారి అనుచరుల జీవితంలో దీనికి సంబంధించిన ఎన్నో ఉపమానాలు మనకు లభిస్తాయి. దీని కారణంగానే వారిలో విడదీయలేని ప్రేమానుబంధాలు పెనవేసుకుని ఉండేవి.

మూడోది, న్యాయం. పరస్పర సంబంధాలు చక్కగా ఉండాలంటే బంధుత్వాలు పటిష్టంగా ఉండాలంటే, అతను ఎదుటివానితో చేసే కార్యకలాపాలు న్యాయంగా ఉండాలి. ధర్మాన్ని స్థాపించడ మంటే న్యాయాన్ని స్థాపించడం అన్నమాట. దివ్య ఖుర్ఆన్‌లో వందలసార్లు న్యాయాన్ని స్థాపించండి, అన్యాయానికి పాల్పడ కండి అని బోధించబడింది. అన్యాయం ఒక చీడ పురుగు లాంటిది. అది సమాజంలో శాంతిని, సామరస్యాన్ని, సుఖాలను సంతోషాలను పూర్తిగా తినేసి ధ్వంసం చేస్తుంది. ఎక్కడైతే న్యాయం నశించి, అన్యాయం పెరిగిపోతుందో అక్కడ శాంతి నశించి అశాంతి ప్రబలిపోతుంది. రక్తపాతం సర్వసామాన్యమై పోతుంది. కనుకనే న్యాయానికి చాలా శక్తి ఉంది. ఎక్కడైతే అన్యాయం జరుగుతూ ఉంటుందో అక్కడ సంఘ ప్రజలు తమ శక్తిమేరకు ఆపటానికి కృషి చెయ్యాలి. లేకపోతే ఇది ఒక వరద మాదిరిగా అందరినీ ముంచివేస్తుంది.

నాలుగోది, ఉపకారం. పరస్పర సంబంధాలలో ఉపకారం కూడా ముఖ్యమైనది. ఉపకారం అనేది మహా గొప్ప గుణం. ఎందుకంటే ఇది ఎదుటివారు ఎలా మాతో ప్రవర్తించినా అతనికి మంచి చెయ్యటమే ఉపకారం. ఇది మహామహులకే సాధ్యం. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : ఎవరైతే నాకు ఇవ్వడో నేను అతనికి ఇస్తాను. ఎవరైనా నాతో తెగదెంపులు చేస్తారో నేను అతనితో స్నేహం చేస్తాను. ఎవరైతే నాకు అన్యాయం చేస్తాడో నేను అతనికి క్షమిస్తాను.

ఐదోది, క్షమాభిక్ష. మనిషి క్షమించటం అంటే చాలా ధైర్యంతో కూడిన విషయం. ఎందుకంటే అతను క్షమించటం కోసం తన కోపంపై అదుపును సాధించాలి. తన హృదయాన్ని విశాలమైనదిగా చెయ్యాలి. సహన స్థైర్యాలతో మనసును నింపుకోవాలి. పరలోక ప్రతిఫలాపేక్షతో మనసును బుజ్జగించాలి. అప్పుడే క్షమించటం అనేది అతనికి సాధ్యమవుతుంది. కాని క్షమాపణలో ఎంత శక్తి ఉందంటే అది తరతరాలతో వచ్చే శత్రుత్వాన్ని సైతం నామరూపాల్లేకుండా చేస్తుంది. ఈ గుణాలన్నీ ఒక సత్సమాజ నిర్మాణం కోసం తప్పనిసరిగా కావలసినవి.




స్వర్గంలో ప్రతి వస్తువు మన స్వాధీనంలో ఉంటుంది. స్వర్గ భోగ భాగ్యాలు శాశ్వ తంగా ఉంటాయి. అంతం కాని అధికారం ఉంటుంది. స్వర్గంలో శాంతి, సుస్థిరతలు ఉంటాయి. స్వర్గంలో మనసుకు నచ్చింది ఉంటుంది. మనసుకు మెచ్చింది చెయ్యవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే, స్వర్గ అన్వేషణే మన ధ్యేయం, అల్లాహ్‌ను రాజీ పర్చుకుని స్వర్గాన్ని సొంతం చేసుకోవడమే మన జీవితాశయం. అల్లాహ్ ఇలా అంటు న్నాడు: "నిశ్చయంగా అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ధన, ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడు" (తౌబహ్: 111)

## స్వర్గంలో ఏముంటుంది?

స్వర్గంలో రంగు ఉంటుంది. స్వర్గంలో రుచి ఉంటుంది. స్వర్గంలో కస్తూరి పరిమళం ఉంటుంది. స్వర్గంలో సౌందర్యం ఉంటుంది. స్వర్గంలో మనసుని రంజింప జేసే రకరకాల వస్తువులుంటాయి. స్వర్గంలో గౌరవం, కీర్తి ఉంటుంది. స్వర్గంలో ప్రశాంతత ఉంటుంది. స్వర్గంలో ప్రైవసీ ఉంటుంది.

## స్వర్గంలో ఏమి ఉండదు?

స్వర్గంలో బాధ ఉండదు, స్వర్గంలో రోగం ఉండదు. స్వర్గంలో నొప్పి ఉండదు, స్వర్గంలో ఆవేదన ఉండదు, స్వర్గంలో ఆందోళన ఉండదు. స్వర్గంలో దగా, మోసం ఉండదు. స్వర్గంలో కష్టం ఉండదు. స్వర్గంలో అసూయ, రాగ ద్వేషాలుండవు. స్వర్గంలో విడిపోతామన్న భయం ఉండదు. స్వర్గంలో మనకు వరానుగ్రహాలను కాజేస్తారేమోనన్న శంక ఉండదు.

## స్వర్గం ఎలా ఉంటుంది?

స్వర్గం చాలా అందంగా ఉంటుంది. ఎంతగానంటే, "ఏ చూపు చూడనంత, ఏ చెవి విననంత, ఏ ప్రాణి హృదయంలో ఊహా చిత్రం సయితం మెదలనంత. స్వర్గ వస్త్రాలు చాలా అందంగా ఉంటాయి. స్వచ్ఛమయిన పట్టు వస్త్రాలు. స్వర్గపు సెలయేర్లు చాలా అందంగా ఉంటాయి. స్వచ్ఛమయిన పాల నదులు, తేనె నదులు. ఆ నదులకు ఇరువైపుల అలంకరించబడిన ముత్యాలు, పగడాలు. వాటి లోపలి కంకరాళ్ళు మణి మాణిక్యాలు. స్వర్గపు సుకన్యలు చాలా అందంగా ఉంటారు. స్వర్గ తలుపులు చాలా అందంగా ఉంటాయి. స్వర్గపు భవనాలు, కోటలు చాలా అందంగా ఉంటాయి.

## ఆ పిదప ఏం జరుగుతుంది?

'ఎవరయితే తమ ప్రభువునకు భయపడుతూ ఉండేవారో, వారు బృందాలు బృందాలుగా స్వర్గం వైపునకు తరలింపబడతారు. తుదకు వారు అక్కడకు చేరుకునేటప్పటికీ దాని ద్వారాలు తెరవబడి ఉంటాయి". (అజ్జుమర్: 73)

క్రమం తప్పకుండా నమాజు చదివేవారు, ఉపవాసాలు ఉండేవారు, జకాత్ చెల్లించేవారు, హజ్జ్ చేసేవారు, నిరుపేదల్ని ఆదుకునే వారు, వితంతువుల బాగోగులు గమనించేవారు, అనాథలకు ఆశ్రయం ఇచ్చేవారు, జిహాద్ చేసేవారు... అందరూ ఆ బృందాల్లో ఉంటారు.

## ఆ బృందాల అధినాయకుడు ఎవరు? జెండా ఎవరిది?

స్వర్గంలో ప్రవేశించక పూర్వమే ప్రియప్రవక్త ముహమ్మద్(స) వారి పవిత్ర దర్శనం జరుగుతుంది. ప్రవక్త (స) ఇలా అన్నారు: ''ఆదం సంతతికి చెందిన సమస్త జనులు ప్రళయదినాన నా జెండా క్రింద ఉంటారు. నా కోసం మాత్రమే స్వర్గపు తలుపు మొదట తెరవబడుతుంది''. (సహీహుల్ జామె)

ఆనక ఏం జరుగుతుంది? ''ప్రళయ దినాన స్వర్గపు తలుపు నా కోసం తెరవబడుతుంది. స్వర్గ పర్యవేక్షకుడు ఇలా అంటాడు: ''ఎవరు మీరు?'' నేను- ముహమ్మద్ (స). అతను అంటాడు: ''నాకు మీ గురించి ఆదేశించబడింది- మీకు ముందు ఎవ్వరి కోసం కూడా స్వర్గపు తలుపు తెరవకూడదు'' అని. (ముస్లిం)

''స్వర్గ పర్యవేక్షకులు వారినుద్దేశించి, 'మీపై శాంతి కురియుగాక! మీరు హాయిగా ఉండండి. శాశ్వతంగా ఉండేందుకు అందులో ప్రవేశించండి'' (అని ఘన స్వాగతం పలుకుతారు). (అజ్జుమర్: 73)

## స్వర్గ వాసులు స్వర్గంలో ఎలా ప్రవేశిస్తారు?

''స్వర్గంలో ప్రవేశించే తొలి బృందం - పూర్ణ చంద్రునిలా ప్రవేశిస్తారు''. (బుఖారీ, ముస్లిం)

''స్వర్గవాసులకు కాలకృత్యాల అవసరం ఉండదు. వారికి ఉమ్మి రాదు. వారి దువ్వెనలు బంగారు దువ్వెనలయి ఉంటాయి. వారి శరీరం నుండి వెలువడే చెమట కస్తూరీ సువాసన గుభాళింపు కలిగి ఉంటుంది. అందరూ ఆది మానవుడు, ప్రవక్త అయిన ఆదమ్ (అ) ఎత్తు, అందం కలిగి ఉంటారు''. (బుఖారీ)

''స్వర్గంలో ప్రవేశించేవారు అపార అనుగ్రహాల మధ్య ఉంటారు. లేమి అనేది ఉండదు. వారు తొడిగిన దుస్తులు మాసిపోవు. వారి యవ్వనం తరగదు'' అన్నారు ప్రవక్త (స). (ముస్లిం)

## స్వర్గంలో ముందు ఎవరు ప్రవేశిస్తారు?

లక్షాధికారులయిన ముస్లింలు కాదు. కోట్లకు పడగలెత్తిన కుబేరులు అంతకన్నా కాదు. కడు నిరుపేదలు. కటిక దారిద్ర్యంలో కత్తి మీద సాములా విశ్వాసాన్ని కాపాడుకుంటూ బతికినవారు. ప్రవక్త (స) ఇలా అన్నారు: ''నిశ్చయంగా ఎప్పుడూ దేశ దిమ్మరులై తిరుగుతూ ఉండే, (ఒక చోట స్థిరనివాసం లేని) ముహాజిర్‌లలోని నిరుపేదలు, ధనికుల కన్నా 40 సంవత్సరాల ముందు స్వర్గంలో ప్రవేశిస్తారు''. (ముస్లిం)

## స్వర్గపు పాత్రలు

''రెండు రజత (వెండి) స్వర్గాలు. వాటిలోని పాత్రలు, సమస్తం వెండివి అయి ఉంటాయి. రెండు పసిడి స్వర్గాలు. అందులోని పాత్రలు, సమస్తం పసిడివి అయి ఉంటాయి''. (బుఖారీ, ముస్లిం)

## స్వర్గ సుకన్యలు

''ఒకవేళ స్వర్గ సుకన్య ప్రపంచవాసుల ముందుకు వస్తే, భుమ్యాకాశాల మధ్యనున్న సమస్తాన్ని ప్రకాశమానం చేసే స్తుంది. కస్తూరీ సువాసనతో వాటిని నింపేస్తుంది. ఆమె తలపై గల దుపట్టా ప్రపంచం, ప్రపంచంలోని సకల వస్తువుల కంటే ఎంతో మేలయినది''. (బుఖారీ)

## స్వర్గపు వృక్షం

''నిశ్చయంగా స్వర్గంలో ఒక వృక్షం ఉంది. చాలా వేగవంతమయిన సవారిపై ఉన్న వ్యక్తి వంద సంవత్సరాలు పరుగులు తీసినా దాన్ని దాటలేడు''. (ముస్లిం)

## చివర్లో స్వర్గానికెళ్ళే స్వర్గవాసి:

''ప్రపంచం అంత స్వర్గాన్ని అతనికిచ్చి ఇలా అనబడుతుంది: ''ఇదంతా నీదే. దీనితో పాటు పదింతలు పెంచి నీకు ఇవ్వబడు తుంది. ఇక్కడ నీ మనసుకు నచ్చింది. నీకు దక్కుతుంది. నీ కన్ను పడిన ప్రతిదీ నీదవుతుంది''. (బుఖారీ, ముస్లిం)

## స్వర్గపు అన్ని తలుపుల గుండా పిలుపు అందుకునే అదృష్టవంతులు

''ఒక విశ్వాసికి ముగ్గురు పిల్లలుండి, వారు యవ్వన స్థాయికి చేరుకోక ముందే మరణిస్తే - అతని ఆ పిల్లలు స్వర్గపు ఎనిమిది తలుపుల్లో ఏ తలుపు నుండి అతను ప్రవేశించాలనుకుంటే ఆ తలుపు దగ్గర అతన్ని స్వాగతించడానికి నిలబడి ఉంటారు''. (ఇబ్ను మాజహ్)

''ఏ స్త్రీ అయితే తనపై విధిగావించబడిన అయిదు పుటల నమాజు క్రమం తప్పకుండా పాటిస్తుందో, తనపై విధిగావించ బడిన (రమజాన్) పూర్తి మాసపు ఉపవాసాలు నిష్ఠగా పాటిస్తుందో, తన శీలాన్ని కాపాడుకుంటుందో, తన భర్తకు విధేయత చూపుతుందో- ఆమెతో ఇలా అనబడుతుంది: ''స్వర్గపు ఎనిమిది ద్వారా ల్లోని నీకిష్టమయిన మార్గం గుండా నువ్వు స్వర్గంలో ప్రవేశించు'' అని. (సహీహుల్ జామె)

''మీలో ఎవరయితే చక్కగా వుజూ చేసి, వుజూ పూర్తయ్యాక - అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ, అల్లాహుమ్మజ్ అల్‌నీ మినత్తవ్వాబీన వజ్అల్‌నీ మినల్ ముతతహ్హిరీన్'' అని చెబుతారో అతని కోసం స్వర్గపు ఎనిమిది ద్వారాలు తెరుచుకుంటాయి. అతనికి నచ్చిన మార్గం గుండా స్వర్గంలో ప్రవేశించవచ్చు'' అన్నారు ప్రవక్త (స). (ముస్లిం).




## ఉత్తరాఖండ్లో ముస్లిములపై దాడులు

ఉత్తర కాశీలోని పురూలా పట్టణంలో ఒకవైపు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ముస్లిముల ఇండ్లు, దుకాణాలపై దాడులు జరుగుతున్నాయి. మరోవైపు ఉత్తరా ఖండ్‌లోని నైనితాల్‌లో కూడా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు యాభై అరవై మంది దుండగుల గుంపు ముస్లిముల దుకాణాలు, ఇండ్లపై పడి విధ్వంసం సృష్టించాయి. ఒక వ్యక్తిని పట్టుకుని గుండు గొరికించారు. పురూలా పట్టణంలో అల్లర్లపై ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి అరెస్టులు చేయలేదు. ఏదో ఒక సాకుతో ముస్లిములపై దాడులు చేయడానికి దుండగుల గుంపులు సిద్ధపడుతున్నాయి. నైనితాల్‌లో కూడా ఇలాగే జరిగింది. పురూలాలో లవ్ జిహాద్ పేరుతో అల్లర్లకు పాల్పడ్డారు. నైనితాల్‌లో ఎవరో వ్యక్తి ఏదో చేశాడనే ఆరోపణతో విధ్వంసం సృష్టించారు. గుర్తు తెలియని దుండగులపై పోలీసులు కేసులు బుక్ చేస్తున్నారు. ఎవరినీ నిర్బంధించడం జరగడం లేదు.

## బక్రీద్ సందర్భంగా సూచనలు జారీ చేసిన ఇస్లామిక్ సెంటర్

లక్నోలోని ఇస్లామిక్ సెంటర్ బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిములకు కొన్ని మార్గదర్శక సూచనలు జారీ చేసింది. ముఖ్యంగా ఖుర్బానీ చేసిన తర్వాత ఆ చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సలహాలు ఇచ్చింది. ఇతర మతస్తుల ధార్మిక భావాలను పరిగణనలో ఉంచుకుని వాటిని గౌరవిస్తూ అలాంటి చిత్రాలు సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని వారించింది. దేశంలో ఈ నెల 29న బక్రీద్ పండుగ జరుపుకుంటున్నారు. ఇస్లామిక్ సెంటర్ చైర్మన్ మౌలానా రాషిద్ ఫరంగీ మహాలీ మాట్లాడుతూ, చట్టపరంగా అనుమతి ఉన్న పశువులను మాత్రమే ఖుర్బానీ చేయాలని సూచించారు. ఖుర్బానీ ఇస్తున్నప్పుడు చట్టపరమైన విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. పరిశుభ్రత, పరిశుద్ధతలను పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై ఖుర్బానీ ఇవ్వరాదని, ఖుర్బానీ తర్వాత వ్యర్థాలను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పారేయరాదని, మునిసిపల్ డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలని చెప్పారు.

## ఇక్కడ విద్వేష ప్రసంగాలు ... అక్కడ లౌకికవాద లౌక్యం

అమెరికాలో నరేంద్రమోడీ పర్యటిస్తున్నారు. అక్కడ పాత్రికేయులు భారతదేశంలో మైనారిటీల గురించి, రాజకీయ అసమ్మతి గురించి అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ భారత, అమెరికా దేశాలు ప్రజాస్వామ్య దేశాలని చెప్పారు. ప్రజాస్వామిక సంస్థలను పటిష్ట పరచడం రెండు దేశాల డిఎన్ఏలో ఉందని చెప్పారు. భారతదేశంలో కులం, మతం, స్త్రీపురుష భేదం ఇలాంటివి ఏవీ పట్టించుకోవడం జరగదని, ఎలాంటి వివక్షలు లేవని బల్లగుద్ది చెప్పారు. కాని ఇక్కడ ఏం జరుగుతుందో కూడా ఒకసారి చూడడం అవసరం. ఉత్తరప్రదేశ్ లోని దాస్నాలో యతి నర్సింగానంద్ మరోసారి విద్వేష ప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టాడు. ఇంతకు ముందు హరిద్వార్ ధర్మసంసద్ లో ముస్లిముల ఊచకోతలకు పిలుపునిచ్చిన సంఘటన చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ కేసులో అరెస్టయి వెంటనే విడుదలైన యతి నర్సింగానంద్ తనకు ఏమీ జరగదని బాగా తెలుసు కాబట్టి మరోసారి అదే పని చేశాడు. ముస్లిములకు వ్యతిరేకంగా హింసోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. ముస్లిములపై జరిగే పోరాటాల్లో హిందూ బచావ్ మోర్చా ఎల్లప్పుడు పాల్గొంటుందని చెప్పాడు. తమ కోసం పనిచేసేవారు ఎవరైనా ఎక్కడైనా హత్యకు గురైతే, వారి ప్రతీకారం తీర్చుకుంటామని, దేశంలోని ప్రతి హిందువు దేశాన్ని హిందూరాష్ట్రగా మార్చాలంటున్నాడని, కాని వాస్తవానికి దేశంలో అలాంటి పరిస్థితి లేదని, దేశం ఇస్లామిక్ దేశంగా త్వరలో మారిపోతుందని హెచ్చరించాడు. ఇలాగే పరిస్థితులు కొనసాగితే 2029లో దేశానికి ఒక ముస్లిం ప్రధాని అయ్యే పరిస్థితి దాపురిస్తుందన్నాడు. ఎవరైనా హిందువు హత్యకు గురైతే, హిందూ ఆడపడుచు లవ్ జిహాద్ వలలో పడితే, హిందూ మందిరాలను అగౌరవపరిస్తే ప్రపంచమంతా వినిపించేలా గర్జించాలని అన్నాడు. పోలీసులు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ అందరూ మనవాళ్ళే, ముజఫ్ఫర్ నగర్ అల్లర్లు జరిగినప్పుడు చాలా మంది ముస్లిములు మరణించారు కాని తర్వాత కాంగ్రెసు వారికి సహాయ పడిందని, మీడియా ముస్లిములపై దౌర్జన్యాలని రాసిందని హిందువులు కూడా ఇది నమ్మడం మొదలుపెట్టారని అన్నాడు. యతి నర్సింగానంద్ తర్వాత మరో ఇద్దరు ముస్లిములపై హింసకాండను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. యతి నర్సింగానంద్ గత సంవత్సరం మాట్లాడుతూ మదరసాలను, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని బాంబులతో పేల్చేయాలన్నాడన్నది కూడా గమనించాలి. ఇలాంటి విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలు చేసేవాళ్ళు చాలా మంది ఉన్నారు. కాని అమెరికాలో ప్రధాని మోడీ మన లౌకిక ప్రజాస్వామిక విలువల గురించి చెబుతున్నారు. ఇక్కడ విద్వేష శక్తులు రెచ్చిపోతున్నాయి.




## పాలస్తీనాలో సరికొత్త అక్రమ ఔట్ పోస్టులు

ఇస్రాయీల్ సైన్యం మద్దతుతో యూద సెట్లర్లు పాలస్తీనాలోని ప్రైవేటు భూభాగంలో అక్రమ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. పాలస్తీనాలోని లుబ్బాన్ అష్షరియా అనే పాలస్తీనా ఊరికి దగ్గరగా ఉన్న భూమిలో ఈ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని అక్రమ సెటిల్మెంట్ల వద్ద ఇటీవల జరిగిన కాల్పుల్లో నలుగురు యూద సెటిలర్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రదేశంలోనే ఇప్పుడు ఈ ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. జెనిన్ శరణార్థి శిబిరంలో ఇస్రాయీల్ సైన్యం దాడి చేసి జరిపిన కాల్పుల్లో ఐదుగురు పాలస్తీనీయులు మరణించారు. మృతుల్లో పసివాడు కూడా ఉన్నాడు. ఆ తర్వాత పాలస్తీనా సాయుధులు జరిపిన దాడిలో నలుగురు యూద సెటిలర్లు మరణించారు. ఇస్రాయీల్ సైన్యం జరిపిన దాడిలో ఐదుగురు పాలస్తీనీయులు మరణించడం మాత్రమే కాదు 91 మంది తీవ్రంగా గాయపడ్డారన్నది కూడా గమనించాలి. ఇప్పుడు ఈ ఊరికి దగ్గరగా అక్రమ సెటిల్మెంట్ల కోసం ఇస్రాయీల్ సైన్యం సహాయం చేసింది. బుల్డోజర్లతో భూమి చదును చేసి సెటిల్మెంటు ఏర్పాటు చేసింది. లుబ్బాన్ అష్షరియా ఊరిపై యూద సెటిలర్లు దాడులు చేసిన వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడిలో ముగ్గురికి తీవ్రమైన గాయాలయినట్లు తెలుస్తోంది. నలుగురు సెటిలర్లు కాల్పుల్లో మరణించిన తర్వాత ఇస్రాయీల్ ప్రధాని ఎలీ అక్రమ సెటిల్మెంట్‌లో వెయ్యి కొత్త ఇండ్లు కట్టడానికి ఆదేశాలిచ్చాడు. ఈ చర్యలు ఇక్కడి సమస్యను మరింత జటిలం చేసే అవకాశాలున్నాయి. అందువల్లనే ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోరియో గుటెరస్ ఇస్రాయీల్ తక్షణం సెటిల్మెంట్ల కార్యకలాపాలన్నీ ఆపేయాలన్నారు. సెటిల్మెంట్ల కార్యకలాపాలు ఈ ప్రాంతంలో హింసాను, ఉద్రిక్తతను పెంచడానికి చేసే పనులుగా ఆయన పేర్కొన్నారు.

## గ్రీసు పడవ ప్రమాదంలో మృతులు పాకిస్తాన్ పౌరులు

పాక్ ఆక్రమిత కశ్మీరులో ఉన్న మారుమూల ఊరు బండ్లీలో విషాదం అలుముకుంది. గ్రీసు సముద్ర తీరంలో మునిగిపోయిన పడవలో అనేకమంది పాకిస్తాన్ పౌరులున్నారు. పాకిస్తాన్‌లో బతుకుదెరువు దొరకని ఈ అభాగ్యులు పొట్ట చేతబట్టుకుని యూరపు దేశాల్లో పనుల కోసం ఏజెంట్ల మాటలు నమ్మి పడవలో ప్రయాణమైనవారు. యూరపులో ఇది అత్యంత భయానకమైన పడవ ప్రమాదం. పాకిస్తాన్, ఈజిప్టు, సిరియా తదితర దేశాలకు చెందిన ఒక చేపల పడవలో ప్రయాణిస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. దాదాపు 400 నుంచి 700 మంది ఆ పడవలో ఉన్నారని అంచనా. పాకిస్తాన్ కొన్ని నెలలుగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అనేకమంది దేశం వదలిపోతున్నారు. యూరపు దేశాల్లో భవిష్యత్తు వెదుక్కుంటూ వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. బండ్లీ ఊరిలో దాదాపు యువకులందరూ ఈ పడవలోనే ఉన్నారని తెలుస్తోంది. ఆ ఊరిలో ఒక తరం మొత్తం ఈ ప్రమాదంలో మరణించారు. పడవ సామర్థ్యానికి మించి ప్రయాణీకులను తీసుకెళ్ళడం వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పడవ ప్రమాదానికి గురవుతుందని తెలిసిన కెప్టెన్ పడవను, ప్రయాణీకులను వదిలేసి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ ప్రమాదంలో చిన్న పిల్లలు కూడా మరణించినట్లు తెలుస్తోంది.

## భారతదేశంలో మైనారిటీల భద్రత గురించి ప్రశ్నించిన ఒబామా?

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత ప్రధాని నరేంద్రమోడీని కలుసుకున్నప్పుడు హిందూ మెజారిటీ దేశంలో ముస్లిం మైనారిటీల భద్రత గురించి తప్పకుండా ప్రశ్నించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. సిఎన్‌ఎన్ పాత్రికేయుడితో మాట్లాడుతూ ఆయన ఈ మాటలు అన్నారు. అమెరికా అధ్యక్షుడు అనేక విషయాలను దృష్టిలో ఉంచుకోవడం తప్పదని, తాను అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అనేకమంది మిత్రదేశాల అధినేతలతో వ్యవహరించానని, అయితే ఇందులో చాలా మంది ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నిస్తే లేదనే చెబుతానని అన్నారు. తనకు ప్రధాని మోడీ తెలుసని, ఆయనతో తాను మాట్లాడడం జరిగితే తాను భారత మైనారిటీల గురించి ప్రశ్నిస్తానని, దేశంలో మైనారిటీల హక్కులకు భద్రత కల్పించలేకపోతే భవిష్యత్తులో పరిస్థితులు చాలా దిగజారుతాయన్నది చెబుతానని అన్నారు. 2015లో ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో బరాక్ ఒబామా మాట్లాడుతూ రెండు దేశాల్లోను హిందువులు, ముస్లిములు, క్రయిస్తవులు, శిక్కులు తదితర మతాలవారున్నారని, మనం గాంధీజీ చెప్పిన మాటలను గుర్తుంచుకోవాలని అన్నారు. ఒకే తోటలోని రంగురంగుల పూలవంటివి విభిన్న మతధర్మాలని గాంధీజీ చెప్పిన మాటలను గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలో ఉన్న మతస్వేచ్ఛ గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

# తల్లిదండ్రులు

- పోలంకి విజయభాస్కర్

నేడు మారుతున్న జీవన ప్రమాణాలు, విధానాల ఫలితంగా తల్లిదండ్రులు పిల్లల ప్రేమ, ఆదరణ కోల్పోతున్నారు. ఫలితంగా ఒకప్పుడు బాగా బతికినవాళ్ళు జీవితం చివరి అంకంలో అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో అయిన వాళ్ళకు దూరంగా బతుకులీడుస్తున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులను బిడ్డలు ఆదరించకపోవడంతో వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. మా ఉద్యోగానికి మేము వెళితే మీ బాగోగులు ఎవరు చూస్తారు? మందులు సమయానికి ఎవరు ఇస్తారు.. వృద్ధాశ్రమాలైతే వారి మంచి కోసమే అంటున్నారు కొందరు బిడ్డలు. పెన్షన్ వస్తున్న తల్లిదండ్రులకు ఉన్న ఆదరణ ఆదాయం లేని తల్లిదండ్రులకు లేదు. లాభనష్టాలు లెక్క వేసే రోజులివి. పైగా వృద్ధులకు సపర్యలు చేయడం భారంగా భావిస్తున్నారు. సంపాదన లేకపోవడం ఒకటైతే సంపాదన ఉన్నా ఆదరించని వారు నేటి సమాజంలో మనం చూస్తున్నాం. ఆస్తుల కోసం తల్లిదండ్రులను పైలోకాలకు పంపే కాలయముళ్ళను వీక్షిస్తున్నాం. ఈ పద్ధతి మారేలా నేటి సమాజానికి దిశా నిర్దేశనం చేయాల్సి ఉంది. ఆ దిశగా నేటి విద్యా వ్యవస్థ కూడా సంస్కరణ జరగాల్సి ఉంది.

## తల్లి పాదాల క్రింద స్వర్గం

ఇస్లామ్‌లో వృద్ధాశ్రమాలకు చోటు లేదు. తల్లిదండ్రులకు సేవ చేయడం కన్నబిడ్డల విధిగా, వారి బాధ్యతగా ఆదేశించబడినది.

దైవప్రవక్త(స) ప్రవచనం ''తల్లిపాదాల క్రింద స్వర్గం ఉంది.'' (తబ్రాని)

దైవప్రవక్త(స) హితోక్తి : 'తండ్రి స్వర్గానికి ద్వారం లాంటివాడు.'' (తిర్మిజీ)

హజ్రత్ అబూ ఉమామ(రజి) అన్నారు : 'ఒక వ్యక్తి ప్రవక్త(స)తో ఇలా విన్నవించాడు, 'దైవప్రవక్తా! తల్లిదండ్రులకు సంతానంపైన ఉన్న హక్కు ఏమిటి?'' అని.


'తల్లిదండ్రులే మీ స్వర్గం, తల్లిదండ్రులే మీ నరకం' అన్నారాయన. (ఇబ్నెమాజా)

అంటే... వారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉంటే మీరు స్వర్గ ప్రాప్తికి అర్హులవుతారు. వారి హక్కుల్ని హరించి వేస్తే నరకాగ్నికి ఆహుతి అవుతారని అర్థం. 'తల్లి పాదాల క్రింద స్వర్గం ఉన్నది' అన్న మాట మరిచి తల్లిదండ్రులకే ఒక నరకాన్ని చవిచూపిస్తున్న ఈనాటి వ్యవస్థను సరైన మార్గంలో నడిపించే నావ అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి బోధనలు మాత్రమే.

## వృద్ధాప్యంలో ఆదరణ ముఖ్యం

ఎల్లప్పుడు తల్లిదండ్రులను సంతోషపరచడానికి ప్రయత్నించాలి. వారి ఇష్టానికి, స్వభావానికి వ్యతిరేకంగా బాధ కలిగేలా మాట్లాడ కూడదు. ఎందుకంటే... ముఖ్యంగా వృద్ధాప్యంలో వారు ప్రతి దానికి విసుక్కుంటూ ఉంటారు. వారికప్పుడు ఏమీ తోచదు. వారు చెప్పిందే కావాలని పట్టుబడతారు. ఆ సమయంలో వారి ప్రతి మాటను సంతోషంతో సహించాలి. తల్లిదండ్రులతో ప్రేమగా మాట్లాడితేనే వారికి మనో ధైర్యం. వారి మాటలు పెడచెవిన పెట్టడం, వారితో తక్కువగా మాట్లాడటం, హీనంగా చూడటం చేస్తే అది తల్లిదండ్రులకు ప్రత్యక్ష నరకం.

తల్లిదండ్రులు మన నుంచి కోరేది ఆత్మీయతను. అయితే మనం ధన వ్యామోహంలో పడి తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నాం. తల్లిదండ్రులకు ఎక్కడో ఒక చోట ఆశ్రయం కల్పిస్తూ ఆదరించే కంటే ఆత్మీయతను పంచి వారి కనుసన్నల్లో బ్రతకడమే వారికి మనమిచ్చే గొప్ప బహుమతి, నిజమైన సద్గతి. అంతేకాకుండా మన కోసం వారు పడ్డ కష్టాలను గుర్తుకు తెచ్చుకుని కృతజ్ఞతా భావంతో మనం ప్రవర్తించాలి.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**